ANN తెలుగు

Follow: @ANNTELUGU

27-03-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 115 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

**టాప్ న్యూస్**

### ఐ అండ్ పిఆర్ సొమ్ము ఇంటి సొమ్ములా వాడుకున్నారు


- బీఆర్ఎస్ ప్రభుత్వం లో పింక్ కలర్ మీడియాకే డబ్బులు
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ధ్వజం



03

### సీఎం రేవంత్ రెడ్డి మంచోడు

- కాబట్టే మీరు ఫాంహౌజ్ లో ఉన్నారు
- ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇక ముందు మరో లెక్క
- సభలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



02

### కేటీఆర్‌పై రెండు కేసులు

- పదవతరగతి పేపర్ లీకేజీ వ్యవహారం
- నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత ఫిర్యాదు



02



## డికాక్ వన్ మ్యాన్ షో

### రాజస్తాన్‌ను చిత్తు చేసిన కేకేఆర్

ఐపీఎల్ 2025లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తొలి విజయం సాధించింది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో కేకేఆర్ గెలుపొందింది. 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్.. 17.3 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. కోల్‌కతా విజయంలో క్వింటన్ డికాక్ కీలక పాత్ర పోషించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన డికాక్ ఆఖరి వరకు క్రీజులో ఉండి మ్యాచ్‌ను ముగించాడు. 60 బంతులు ఎదుర్కొన్న డికాక్.. 8ఫోర్లు, 5 సిక్స్‌లతో 97 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు రఘువంశీ(22), రహానే(18) పరుగులతో రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో హసరంగా ఒక్కడే ఓ వికెట్ సాధించగా.. మరో వికెట్ రనౌట్ రూపంలో వచ్చింది.

మిగతా 8లో



### ఏప్రిల్ చివరివారంలో ఇంటర్ ఫలితాలు

**25 లేదా 26న ప్రకటన**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పరీక్షలు ముగియగా, జవాబుపత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైంది.

మిగతా 2లో



### సభను బుల్డోజ్ చేస్తున్నారు

- సభలో నన్ను మాట్లాడనీయడం లేదు
- స్పీకర్ ఓంబిర్లాపై రాహుల్ తీవ్ర ఆరోపణ
- సభలో ఏం జరుగుతుందో తెలియడం లేదన్న ప్రతిపక్ష నేత

వివరాలు 3లో



ఎంఎంటీఎస్ ఘటన నేపథ్యంలో

### రైల్వే శాఖ కీలక నిర్ణయం

**పానిక్ మోడ్ బటన్ల ఏర్పాటుకు నిర్ణయం**

వివరాలు 2లో



### పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దు

**పల్లాకు మంత్రి పొన్నం కౌంటర్**

వివరాలు 3లో

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు

## హరీశ్ పార్టీ మారినా రావు

### 2028 దాకా ఉప ఎన్నికలు ఉండవ్

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన



"రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు. హరీశ్ కాంగ్రెస్ లో చేరినా ..వేరే పార్టీలో చేరినా బై ఎలక్షన్ రాదు. సభ్యులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి అంతా రాష్ట్ర అభివృద్ధి పైనే. ఎవరు ఎన్ని ప్రచారాలు చేసిన 2028లోనే ఎన్నికలు వస్తాయి' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది అని రేవంత్ అన్నారు.

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో

### బెట్టింగ్ యాప్స్ తాటతీస్తాం

**విచారణతోనే సరికాదు.. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్**

- సీఎం రేవంత్ సంచలన ప్రకటన.. ఆన్ లైన్ బెట్టింగ్, రమ్మీపై కఠినంగా ఉండాలని నిర్ణయం
- బెట్టింగ్ లో ఏ రకమైన భాగస్వామ్యమున్నా చర్యలు తప్పవు
- శాంతిభద్రతలపై ప్రతిపక్షం దుష్ప్రచారం.. పెట్టుబడులను అడ్డుకునే కుట్ర
- ఎంత పెద్దోళ్ళున్నా డోన్ట్ కేర్.. ఇప్పటికే 25 మంది సినీ, సోషల్ మీడియా సెలబ్రిటీలపై కేసులు

02



**సభలో దుమారం**

## కేటీఆర్ x భట్టి

### 30 శాతం కమీషన్ అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు

### ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలన్న డిప్యూటీ సీఎం

**మహా :** శాసనసభలో బుధవారం బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. 30, 20 శాతం కమీషన్లు తీసుకుని బిల్లులు చేస్తున్నారని, కాంట్రాక్టర్లు సచివాలయం వద్ద ఆందోళనలు చేస్తున్నారన్న ఆయన మాటలపై అధికార పక్షం భగ్గుమంది. కేటీఆర్ వ్యాఖ్యలపై ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క సైతం తీవ్రంగా స్పందించారు. నిరాధార ఆరోపణలు చేసిన కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ సభ్యులు ఒళ్లుదగ్గరపెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ముందుగా శాసన సభలో బడ్జెట్ పద్దులపై చర్చలో భాగంగా బీఆర్ఎస్ సభ్యుడు పల్లారాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం పని తక్కువ ప్రచారం ఎక్కువ అంటూ మాట్లాడారు. దీన్ని మంత్రి పొంగులేటి తప్పుపట్టారు. ఇలాంటి చవకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఇదే అంశంపై కేటీఆర్ జోక్యం చేసుకుని మంత్రులు ప్రతిసారీ సభ్యుల ప్రసంగాలకు అడ్డు తగలవద్దంటూనే ఈ ప్రభుత్వంలో కమీషన్లు లేకుండా పనులు జరగడం లేదని వ్యాఖ్యానించారు.

"మంత్రులు అంత ఎగ్జైట్ అయి మాట్లాడితే ఎలా? ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉంది. మీరు నెరవేర్చని హామీలు, పథకాలపైనే మాట్లాడుతున్నాము. మంత్రులు లాగే మేము కూడా రెచ్చగొట్టాలంటే ఆ పని చేయవచ్చు. 30 శాతం కమీషన్లు అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమీషన్లని సచివాలయంలో ధర్నాలు చేస్తున్నారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. సభలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

మిగతా 2లో

### లేడీ డాన్ సంగీత సాహు పట్టివేత

- ఒడిశాలో అరెస్టు చేసిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు
- హైదరాబాద్‌లో ఐదు కేసులు నమోదైనట్లు తెలిపిన పోలీసులు
- ఒడిశా వెళ్లి అరెస్టు చేసిన ఎస్టీఎఫ్ పోలీసులు
- నాలుగేళ్ల క్రితం గంజాయి వ్యాపారంలోకి దిగిన సంగీత సాహు

03

### ఆ వ్యాఖ్యలు అమానవీయం

- ఏమాత్రం సున్నితమైనవి కాదు
- హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



03

### భూ భారతి కాదు.. భూ హారతి

**పల్లా రాజేశ్వర్ రెడ్డి**

- భవిష్యత్‌లో భూభారతిపైనే ఎన్నికలకు వెళ్తాం: పొంగులేటి
- ధరణిపై అసెంబ్లీలో మాటల యుద్ధం



03

## మహిళా సంఘాలకు రూ.23 వేల కోట్ల రుణాలు

### స్త్రీనిధికి సిబ్బందిని నియమిస్తాం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా :** మహిళా సంఘాలు అంటే స్వయం ఉపాధి సంఘాలు కాదని, పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళా సంఘాలు ఎదిగాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రతి సంవత్సరం స్త్రీ నిధి సంస్థ ఏ గ్రేడ్ సాధించిందని, మహిళలు గొప్ప ఆర్థిక వేత్తలు అనడానికి ఇదే నిదర్శనమన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో జరిగిన స్త్రీ నిధి 12వ సర్వసభ్య సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళా సంఘాలకు 3500 కోట్ల వడ్డీలను ఎగ్గొట్టిందని, తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలను చెల్లిస్తున్నామన్నారు. గతంలో పావలా వడ్డీ గత ప్రభుత్వం వసూలు చేస్తే.. మేము ఇష్టంగానే వేలకోట్ల రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికీ మహిళా సంఘాలకు 23 వేల కోట్ల బ్యాంకు రుణాలను ఇప్పించామన్నారు.

మిగతా 3లో







# రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు

## హరీశ్ పార్టీ మారినా రావు

### 2028 దాకా ఉప ఎన్నికలు ఉండవ్

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన



"రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు. హరీశ్ కాంగ్రెస్ లో చేరినా ..వేరే పార్టీలో చేరినా బై ఎలక్షన్ రాదు. సభ్యులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి అంతా రాష్ట్ర అభివృద్ధి పైనే. ఎవరు ఎన్ని ప్రచారాలు చేసిన 2028లోనే ఎన్నికలు వస్తాయి' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది అని రేవంత్ అన్నారు.

- మహా, హైదరాబాద్

## రాష్ట్రాన్ని ప్రపంచ చిత్రపటంలో పెట్టాలని చూస్తున్నాం

రాష్ట్రాన్ని ప్రపంచ చిత్ర పటంలో పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అత్యధికంగా విదేశీ పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచేలా ముందుకు వెళ్తున్నామన్నారు. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. బీఆర్ఎస్ నేతలు కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారని... జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లో అంతర్గత పోటీ ప్రభుత్వానికి తలనొప్పిగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# బెట్టింగ్ యాప్స్ తాటతీస్తాం

**హైదరాబాద్, మహా:** ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గేమింగ్, రమ్మీ కేసులు, చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్ లపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేయాలని నిర్ణయించామని.. కఠినమైన శిక్షల కోసం చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. బెట్టింగ్ నేరస్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందని స్పష్టం చేశారు. నేరస్థులను కఠినంగా శిక్షించడానికి ప్రతిపక్షాలు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీకి ప్రచారం కల్పించినవారిని విచారించామని.. ప్రచారం చేసిన వారిని ప్రశ్నించడంతోనే సమస్య పరిష్కారం కాదన్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటుతో అడ్డుకట్ట వేయాలని నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గతంలో వామన్ రావు దంపతులను నరికిచంపారని.. అయితే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గత సర్కార్ హయాంలో దిశ ఘటన జరిగిందన్నారు. 2020 దేశంలో మహిళలపై జరిగిన ఘటనపై నాలుగో స్థానంలో తెలంగాణ ఉందన్నారు. జూబ్లీహిల్స్ పబ్‌లో మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో బీఆర్ఎస్ నేతల కొడుకులు ఉన్నారని తెలిసిందే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగకుండా దురుద్దేశ్యంతో ప్రతిపక్షం ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. స్వార్థం కోసం ప్రభుత్వం మీద.. అభివృద్ధి మీద యాసిడ్ దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రలు మానుకోవాలని.. విజ్ఞతతో మాట్లాడాలని హితవు పలికారు. ప్రతిపక్షాలకు సామాజిక బాధ్యత లేదా అని ప్రశ్నించారు. తెలంగాణను ఆదర్శంగా నిలపాలని చేస్తుంటే.. దురుద్దేశ్యంతో అడ్డుపడుతున్నారన్నారు. ధరల నియంత్రణలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. కడుపునిండా విషం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# సీఎం రేవంత్ రెడ్డి మంచోడు

## కాబట్టే మీరు ఫాంహౌజ్ లో ఉన్నారు

ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇక ముందు మరో లెక్క

సభలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిప్పులు



**మహా :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, 8 వేల హత్యలు, లక్ష దొంగతనాలు జరిగాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేందుకు కూడా బీఆర్ఎస్ అవకాశం కల్పించలేదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని బీఆర్ఎస్ ఖూనీ చేసిందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మంచి వ్యక్తి కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఫామ్ హౌజ్‌లలో ఇంకా ప్రశాంతంగా ఉన్నారని, లేకుంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆయన విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో 8 వేల హత్యలు, లక్ష దొంగతనాలు జరిగాయని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారంతో పాలన సాగించిందని, తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలన అధికార దుర్వినియోగానికి నిదర్శనమని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు.

పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పెద్దలు చెప్పినట్టు అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పోలీసు వ్యవస్థను బీఆర్ఎస్ దారుణంగా వాడుకుందని కోమటిరెడ్డి మండిపడ్డారు. ప్రపంచంలోనే ఇంతటి అధికార దుర్వినియోగానికి పాల్పడిన ప్రభుత్వం ఎన్నడూ లేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేందుకు బీఆర్ఎస్ అవకాశం కూడా ఇవ్వలేదని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌పై ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్లలో ఇష్టానుసారంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాష్ట్రాన్ని ప్రతిపక్షం లేకుండా చేశారని, అలాంటిది పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపుల గురించి బీఆర్ఎస్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచివారు కాబట్టే బీఆర్ఎస్ నేతలు 15 నెలలుగా ఫామ్ హౌజ్‌లో ప్రశాంతంగా పడుకుంటున్నారని, లేదంటే పరిస్థితి వేరేలా ఉండేదంటూ రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అయినా నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క పరిస్థితి ఉంటుంది చూడండి అంటూ రాజగోపాల్ రెడ్డి సంచలన కామెంట్లు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని స్పష్టం చేశారు. వెయ్యి జన్మలెత్తినా మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ రాదని కోమటిరెడ్డి అసెంబ్లీలో స్పష్టం చేశారు.

# కేటీఆర్ x భట్టి



(మొదటిపేజీ తరువాయి)

ఈ దశలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. శాసనసభను రాష్ట్రాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. 30 శాతం కమిషన్ అంటున్న కేటీఆర్ నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. లేదంటే సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల పనులు చేపించి బిల్లులు ఇవ్వలేదన్నారు.

### రికార్డుల నుంచి తొలగింపు


మీ పాపం వల్ల బిల్లులు రాకా గుత్తేదారులు ఏడుసున్నారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి డిప్యూటీ సీఎం అన్నారు. తాము ప్రస్తుతం బిల్లుల చెల్లింపులను సరి చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యుల డిమాండ్‌ను తోసిపుచ్చడంతో వాళ్లు సభ నుంచి వాకౌట్ చేశారు.

కేటీఆర్ గౌరవంగా మాట్లాడుతారని నేను ఊహించా. కేటీఆర్ సభనే కాదు రాష్ట్రాన్ని కూడా తప్పుదోవపట్టిస్తున్నారు. అభయ హస్తం పేరుతో అడ్డగోలుగా ప్రకటనలు ఇచ్చారని కేటీఆర్ చెప్పారు. రూ.4 కోట్లు ఇచ్చి రూ.40 కోట్లు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని పల్లా అన్నారు. మేం ప్రకటనలు ఇచ్చినట్టు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చూశారా? నిరాధార ఆరోపణలతో పల్లా సభను తప్పుదోవపట్టించారు. 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని కేటీఆర్ అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.40 వేల కోట్ల పనులు చేసి బిల్లులు చెల్లించలేదు. కేటీఆర్ తన ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేస్తున్నా. నిరూపించని పక్షంలో కేటీఆర్ క్షమాపణ చెప్పాలి. మైకు ఉందని అడ్డగోలు ఆరోపణలు చేయడం సరికాదని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## ఎంఎంటీఎస్ ఘటన నేపథ్యంలో

# రైల్వే శాఖ కీలక నిర్ణయం

### పానిక్ మోడ్ బటన్ల ఏర్పాటుకు నిర్ణయం




**మహా :** హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైలు ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళ్లే ఎంఎంటీఎస్ రైలులో యువతిపై ఓ ఆగంతకుడు అత్యాచారం చేయబోగా అతని నుంచి తప్పించుకునే క్రమంలో రైలు నుంచి బయటకు దూకేసింది ఆ యువతి. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనను దక్షిణ మధ్య రైల్వే తీవ్రంగా పరిగణించింది. మహిళల భద్రత విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళలకు అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించే విధంగా ఎంఎంటీఎస్ రైళ్లలో పానిక్ మోడ్ బటన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఈ బటన్‌ను నొక్కిన వెంటనే ఆ సమాచారం రైల్వే పోలీసులకు చేరుతుంది. వెంటనే రైల్వే పోలీసులు తక్షణ సాయం అందించి చర్యలు తీసుకుంటారు. దీంతోపాటు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్ పీఎఫ్) అధికారులు రైళ్లలో సైతం పెట్రోలింగ్ నిర్వహించి మహిళా ప్రయాణికుల భద్రతను పర్యవేక్షించనున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంఎంటీఎస్ రైళ్లలో భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తాజాగా సమీక్ష జరిపారు. సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైలులో జరిగిన ఘటన పునరావృతం కాకుండా ప్రతి రైలులో ఒక రైల్వే పోలీస్ అధికారి ఉండాలని నిర్ణయించారు. మరోవైపు ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం 13 బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నారు. నిందితుడి నుంచి తప్పించుకునే క్రమంలో కదులుతున్న రైలు నుంచే యువతి కిందకు దూకిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ యువతి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

# కేటీఆర్ పై రెండు కేసులు

## పదవ తరగతి పేపర్ లీకేజీ వ్యవహారం

### నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత ఫిర్యాదు



**నల్లగొండ, మహా :** నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత ఫిర్యాదుతో మాజీ మంత్రి కేటీఆర్ పై పోలీసులు రెండు కేసులు ఫైల్ చేశారు. పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటన దుమారంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. పది పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్‌కు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో కేటీఆర్ ట్వీట్‌పై నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత,శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు ఉగ్గడి శ్రీనివాస్ కూడా సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. కాగా.. ఈనెల 21న నకిరేకల్‌లో టెన్త్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే తెలుగు ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలోని 8వ నెంబర్ గది నుంచి తెలుగు ప్రశ్నాపత్రం లీకైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించగా.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్విజిలేటర్‌ను కూడా సస్పెండ్ చేశారు. అంతే కాకుండా ప్రశ్నపత్రం లీకేజ్ అవడానికి ఓ విద్యార్థిని కారణం అంటూ ఆమెను డిబార్ చేశారు. అయితే పేపర్ లీక్‌పై తనకు ఏ పాపం తెలియదని.. ఓ వ్యక్తి కిటీకి వద్దకు పేపర్ చూపించాలని లేకపోతే రాయితో కొడతానని బెదిరించానని.. అందువల్లే భయంతో పేపర్ చూపించినట్లు వాపోయింది. తనను డిబార్ చేయొద్దని.. పరీక్ష రాసే అవకాశం ఇవ్వాలని విద్యార్థిని వేడుకుంది.

# ఐ అండ్ పిఆర్ సొమ్ము ఇంటి సొమ్ములా వాడుకున్నారు

- బీఆర్ఎస్ ప్రభుత్వం లో పింక్ కలర్ మీడియాకే డబ్బులు
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం



**హైదరాబాద్, మహా:** ఐ అండ్ పిఆర్ సొమ్మును సొంత ఇంటి సొమ్ము లాగా వాడుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రా నికి పరిమితం కాకుండా జాతీయ పార్టీ లాగా దేశం అంత డబ్బులు వాడుకున్నారని మండిపడ్డారు. సభలో దీనిపై చర్చకు సిద్ధమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పింక్ కలర్ మీడియా లకు ఆ సంస్థ లకు ఇచ్చిన డబ్బులు ఎంత..మిగతా మీడియా సంస్థలకు ఇచ్చిన డబ్బులు ఎంతో చూద్దామని, సభ లో తాము చర్చ కు రెడీ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఐ అండ్ పీఆర్ నుంచి ఒక్క రూపాయి యాడ్ ఇవ్వలేదని, ఐ ఆండ్ పిఆర్ మంత్రిగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఒక్క రూపాయి ఇచ్చి ఉంటే ఏం చేయమన్నా చేస్తానన్నారు.



## ఆదిలాబాద్, నిజామాబాద్ కు

# సానుకూలం

- ఫీజిబులిటీ రిపోర్ట్ ఓకే
- మంత్రి కోమటిరెడ్డి ప్రకటన

**హైదరాబాద్, మహా:** వరంగల్ ఎయిర్‌పోర్ట్ సాధ్యమైనది. ఆదిలాబాద్, నిజామాబాద్ ఎయిర్‌పోర్ట్‌లకు కూడా అనుకూలమైన నివేదిక వచ్చింది. పాల్వంచ, పెద్దపల్లి కోసం అభ్యర్థన చేశాం, దానికి సర్వే ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే దేవరకద్ర (మహబూబ్‌నగర్) ఎయిర్‌పోర్ట్ అనుమతి సాధ్యపడదు, ఎందుకంటే జీఎంఆర్ ఎన్‌ఓసీ సమస్య ఉంది అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీ వేదికగా బుధవారం ప్రకటించారు.

## ఏప్రిల్ చివరివారంలో

# ఇంటర్ ఫలితాలు

### 25 లేదా 26న ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ చివరివారంలో ఫలితాల విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9,96,971 విద్యార్థులు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు రాశారు. వీరిలో ఫస్టియర్‌లో విద్యార్థులు 4,88,448 మంది, సెకండియర్ విద్యార్థులు 5,08,523 మంది ఉన్నారు. ఇక గతంలో ఫెయిలైన విద్యార్థులు 67,735 మంది కూడా ఈసారి పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 1,532 పరీక్ష కేంద్రాల్లో అక్కడక్కడా కొందరు విద్యార్థులు కాపీ కొడుతూ డీబార్ అయినప్పటికీ సింహభాగం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 సెంటర్లల్లో నిర్వహిస్తున్నారు. మార్చి 19 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. మూల్యాంకనం అనంతరం ఇంటర్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేసే లక్ష్యంతో అధికారులున్నారు. ఏప్రిల్ 29వ తేదీ నుంచి ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల ఆ పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగానే ఫలితాలు వెల్లడించాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉంది. గతేడాది మార్చి 19వ తేదీకి పరీక్షలన్నీ పూర్తికాగా, ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు వెల్లడించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# మహిళా సంఘాలకు రూ.23 వేల కోట్ల రుణాలు

## స్త్రీనిధికి సిబ్బందిని నియమిస్తాం : మంత్రి సీతక్క



(మొదటిపేజీ తరువాయి)
స్త్రీనిధి బ్యాంకుకు రూ.800కోట్ల సేవింగ్స్, రూ. 5200 కోట్ల మూలనిధి ఉందన్నారు. మహిళలకు మీకు మీరే ఒక బ్యాంకు ఏర్పాటు చేసుకుని అతి తక్కువ వడ్డీలకే రుణాలు ఇస్తున్నారని తెలిపారు. వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి మహిళలను కాపాడేందుకు 2011 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీ నిధి సహకార సంస్థను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఒకప్పుడు మహిళలకు రూపాయి అప్పు కూడా పుట్టకపోయేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వానికి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. ఆశ, ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం మహిళలకు వుందని, అదే మహిళా శక్తిని ఈ స్థాయికి తీసుకొచ్చిందన్నారు. ఆకాశాన్ని చిల్చుకుని సునీత విలియమ్స్ అంతరిక్షానికి వెళ్లి వచ్చింది..మీకు అవకాశాలు ఇస్తే అవకాశాన్ని చేర్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. ఇప్పటికే రెండున్నర లక్షల చిన్న మధ్య తరహా సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నాయని, మహిళా సంఘాల సభ్యుల నైపుణ్యాన్ని పెంచేలా అత్యున్నత సంస్థలతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు కోసం ఇక్రిసాతో ఒప్పందాలు చేసుకుంటున్నామని, స్థానికంగా లభ్యమయ్యే వనరుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళా ప్రగతి సమాజ ప్రగతికి కొలమానం అన్న అంబేద్కర్ వ్యాఖ్యలను గుర్తు చేశారు.

**ఆత్మవిశ్వాసంతో అడుగేయండి**

మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం పెంచేందుకు కోట్లు వెచ్చించి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజారు ఏర్పాటు చేశామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి జిల్లాలో మహిళా శక్తి బజార్లను ఏర్పాటు చేసేందుకు ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల విజయాలు చూసి గర్వపడుతున్నానని, మహిళా స్వయం సహాయక సంఘాల విజయాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. అది మరింత మంది మహిళలకు ధైర్యాన్నిస్తోందన్నారు. మహిళలు సీఈఓ లు మేనేజర్లుగా ఉన్న కంపెనీలు లాభాల్లో దూసుకుపోతున్నాయని, ఆత్మవిశ్వాసంతో ఆత్మగౌరవంతో అడుగువేస్తే విజయం సొంతమవుతుందన్నారు. అందుకు నిదర్శనమే స్త్రీ నిధి బ్యాంక్ అని అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాలే ఒక మహిళా బ్యాంకును నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. ఎన్నో వర్గాలకు ఇది స్ఫూర్తిదాయకమని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 4600 కోట్ల సబ్సిడీ రుణాలను ఇస్తున్నామని తెలిపారు. 50 వేల నుంచి రెండు లక్షల వరకు రాయితీ ఇస్తున్నామన్నారు. స్త్రీ నిధికి అవసరం అయిన సిబ్బంది ని నియమిస్తామని, ప్రతి మహిళా ఎస్ హెచ్ జీ లో ఉండాలని సూచించారు. స్త్రీ నిధి బ్యాంక్ పై సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ రవీందర్ రావు రూపొందించిన పాటను మంత్రి ఆవిష్కరించారు.

# భూ భారతి కాదు భూ హారతి : పల్లా రాజేశ్వర్ రెడ్డి

## భవిష్యత్‌లో భూభారతిపైనే ఎన్నికలకు వెళ్తాం: పొంగులేటి.. ధరణిపై అసెంబ్లీలో మాటల యుద్ధం



**మహా:** భూ భారతిపై అసెంబ్లీలో వాడివేడిగా మాటల యుద్ధం కొనసాగింది. ధరణి, భూ భారతి అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య చర్చ జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దశలో అధికార, విపక్ష సభ్యుల నినాదాలతో గందరగోళం ఏర్పడింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ధరణి, భూ భారతి అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..'భూములపై రైతులకు హక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీనే. భూ రక్షణ కోసం ఏదైనా జరిగింది అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందే. కబ్జా కాలం ఇచ్చి పేదలకు హక్కులు ఇచ్చాం. ధరణితో పేదల భూములను బీఆర్ఎస్ లాక్కుంది. భూస్వాముల చట్టం ధరణి. లక్షల ఎకరాల భూములు వివాదంలో ఉండడానికి కారణం బీఆర్ఎస్.రైతుల హక్కులను కాలరాశారన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోంది. దున్నేవాడికే భూమి కదా సాయుధ పోరాట నినాదం. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టమే ధరణి. బంగాళాఖాతంలో ధరణిని వేస్తామని చెప్పాం. బంగాళాఖాతంలో వేశాం.. కొత్త చట్టం తెచ్చాం. జమాబందీ వల్ల లాభం తప్ప నష్టం లేదు. ప్రతీ సంవత్సరం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం వల్ల సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

**భూ భారతి కాదు.. భూ హారతి: పల్లా రాజేశ్వర్ రెడ్డి**

భూ భారతిపై కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్తే.. మేము కూడా ధరణిపైనే ఎన్నికలకు వెళ్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది భూ భారతి కాదు భూ హారతి. జమాబంది పేరుతో మరో దుకాణం తెరిచింది. ఇప్పుడు జమాబంది ఎందుకో ప్రభుత్వం చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.

**భవిష్యత్‌లో భూభారతిపైనే ఎన్నికలకు వెళ్తాం: పొంగులేటి**

దీంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి సుధాకర్ రెడ్డి లేచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసత్యాన్ని సత్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే వారిని ఓడించారని, ధరణి రెఫరెండంతో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లామన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎవరిని ఆదరిస్తారో చూద్దాం. ధరణితో బీఆర్ఎస్ సభ్యులు ఇబ్బంది పడ్డారు. ధరణి తప్పిదాలను బీఆర్ఎస్ ఎందుకు ఒప్పుకోవడం లేదని నిలదీశారు. అసత్యాన్ని సత్యాన్ని చేసేందుకు పల్లా ప్రయత్నం చేస్తున్నారని, 2020న ధరణి చట్టం తీసుకువచ్చి.. 2023 వరకు రూల్స్ ఫ్రేమ్ చేయలేదని మంత్రి దుయ్యబట్టారు. వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని చట్టంలోనే పెట్టామని స్పష్టం చేశారు.

# సభను బుల్డోజ్ చేస్తున్నారు

## సభలో నన్ను మాట్లాడనీయడం లేదు

### స్పీకర్ ఓంబిర్లాపై రాహుల్ తీవ్ర ఆరోపణ

### సభలో ఏం జరుగుతుందో తెలియడం లేదన్న ప్రతిపక్ష నేత



**మహా :** లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తనను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సభా కార్యక్రమాలు అప్రజ్వామిక విధానంలో సాగుతున్నాయని, కీలక అంశాలను ప్రస్తావించేందుకు తాను పదే పదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ, అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదని, మాట్లాడేందుకు అవకాశం ఇమ్మని స్పీకర్ ను కోరుతున్నప్పటికీ అనుమతించడం లేదని చెప్పారు. ఇది సభ నడిపే పద్ధతి కాదన్నారు. మహాకుంభ మేళా గురించి ఇటీవల ప్రధాని మాట్లాడినప్పుడు తాను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నాననీ, కానీ పదేపదే అడ్డుకట్ట వేశారని రాహుల్ వాపోయారు. ''నేనేమీ చేయలేక కూర్చుండి పోయాను. ఇప్పటికీ నేను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యానికి చోటు లేదు" అని అన్నారు

**నిబంధనలు పాటించండి**

దీనికి ముందు, బుధవారం సభా కార్యక్రమాల సమయంలో స్పీకర్ ఓంబిర్లా రాహుల్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, సభ గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలను పాటించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన సభా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం లేదని పలుమార్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ సభలో తండ్రీకూతురు, తల్లీ కుమార్తె, భార్యాభర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రతిపక్ష నేత 394 నిబంధన ప్రకారం నడుచుకుంటారని అశిస్తున్నానని అన్నారు. కాగా, స్పీకర్ ఏ సందర్భంలో ఈ సూచన చేశారనది మాత్రం వెంటనే తెలియలేదు.

**స్పీకర్‌కు సమాధానం ఇచ్చేలోపే**

కాగా, స్పీకర్ తన గురించి వ్యాఖ్యలు చేసి దానిపై మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకుండానే సభను వాయిదా వేశారని రాహుల్ గాంధీ తెలిపారు. గత వారం కూడా తనకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయని గుర్తు చేసారు.



# పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దు

## పల్లాకు మంత్రి పొన్నం కౌంటర్

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దని.. ఎవరైనా పోలీసులను ఉపయోగించుకొని ప్రభుత్వాన్ని నడిపితే.. గత బీఆర్ఎస్‌లా తాము ప్రతిపక్షంలో ఉండాల్సి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచారయత్నం ఘటనపై మాట్లాడుతూ...నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని అనడానికి ఈ ఘటన నిదర్శమన్నారు.. రాజధాని నగరంలో యువతిపై అత్యాచారయత్నం జరిగి రెండు రోజులు అవుతున్నా నిందితుడిని పట్టుకోలేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాగా, పల్లా వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. హైదరాబాద్ లోక్ ట్రైన్ అయిన ఎమ్ఎమ్‌టీఎస్‌లో జరిగిన ఘటనలో నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారని సమాధానమిచ్చారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులకు సంబంధించి సంస్కరణలు చేసిందన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ కొనసాగుతున్నదని, నేరస్తులపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. రాష్ట్ర పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దని.. ఎవరైనా పోలీసులను ఉపయోగించుకొని ప్రభుత్వాన్ని నడపడం వల్ల బీఆర్ఎస్ ప్రతిపక్షంలో కూర్చున్నదని చురకలటించారు.

### చైనా టు ఇండియా ఫ్లైట్ సర్వీసెస్

# ఐదేళ్ల తర్వాత రీస్టార్ట్



**మహా:** భారత్, చైనా మధ్య ఐదేళ్ల తర్వాత నేరుగా విమాన సర్వీసులు తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నట్లు చైనా కాన్సుల్ జనరల్ జు వీ తెలిపారు. ఈ విషయంపై భారత అధికారులతో చర్చలు జరుపుతున్నామని ఆయన చెప్పారు. కొవిడ్, గల్వాన్ సంఘర్షణల నేపథ్యంలో భారత్, చైనా మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అందుకే ఇప్పుడు విమాన సర్వీసులు తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నట్లు జనరల్ జు వీ వెల్లడించారు. ఈ మేరకు కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కొవిడ్‌కు ముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్మింగ్ నుంచి భారత్‌లోని దిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఇతర నగరాలకు వారానికి 50 విమాన సర్వీసులుండేవని ఆయన చెప్పారు. ఆ సేవలను తిరిగి పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

**భారత్‌తో కలిసి వేడుకలను జరుపుకోవడానికి రెడీ**

విమాన సర్వీసుల పునరుద్ధరణ తర్వాత వీసా నిబంధనల్లో కూడా సడలింపులు చేసే అవకాశం ఉన్నట్లు చైనా కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలకు మరో వారంలో 75 ఏళ్లు పూర్తవుతుండడం వల్ల ఏప్రిల్ 1న ఇరుదేశాలు సంయుక్తంగా కొన్ని వేడుకలను జరుపుకోనున్నట్లు జు వీ వెల్లడించారు. భారత్‌తో కలిసి వేడుకలను జరుపుకోవడానికి, దౌత్య సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడానికి ఉత్సాహంగా ఉన్నామని ఆయన అన్నారు. జనవరిలో భారత్ విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ చైనాను సందర్శించిన తర్వాత భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మొదట ఈ ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాల మధ్య విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిపింది. కొవిడ్ 19 మొదలైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు నిలిచిపోయాయి. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం విషయంలో రెండు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా విమాన సర్వీసుల అంశం చర్చకు వచ్చినట్లు పేర్కొంది.




# వృద్ధిలో భారత్

## ఐఎంఎఫ్ గణాంకాలు

**మహా:** భారత్ వృద్ధిలో ఉంది. ప్రపంచంలోని టాప్ ఐదు ఆర్థికవ్యవస్థల్లో ఒకటిగా నిలబడింది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) 2025 నాటికి 4.3 ట్రిలియన్ల డాలర్లకు చేరింది. గత 10 ఏండ్లలో ఇండియా జీడీపీ 105 శాతం వృద్ధి చెందిందని ఐఎంఎఫ్ పేర్కొన్నది. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) ప్రకారం దశాబ్ద కాలంలో భారత్ 77 శాతం వృద్ధి నమోదు చేసింది. 2015లో 2.4 ట్రిలియన్ల డాలర్ల నుంచి 2025లో 4.3 ట్రిలియన్ల డాలర్లకు పెరిగింది. ఈ వేగవంతమైన వృద్ధి భారత్‌ను ప్రపంచంలోని మొదటి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో చేర్చింది. 2025లో జపాన్‌ను అధిగమించి, 2027 నాటికి జర్మనీని అధిగమించే అవకాశం ఉన్నది. మిగతా దేశాల అభివృద్ధిని కూడా ఐఎంఎఫ్ విడుదల చేసింది. చైనా పదేండ్లలో 74 శాతం జీడీపీ వృద్ధిని సాధించింది. 2015లో 11.2 ట్రిలియన్ల డాలర్ల నుంచి 2025లో 19.5 ట్రిలియన్ల డాలర్లకు పెరిగింది. కోవిడ్ మహమ్మారి, కొనసాగుతున్న ఆర్థిక సవాళ్ల నుంచి ఎదురు దెబ్బలతో చైనా అమెరికాను అధిగమించలేకపోయింది. అమెరికా ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 2015లో అమెరికా జీడీపీ 23.7 ట్రిలియన్ల డాలర్లు ఉండగా, 2025లో 30.3 ట్రిలియన్ల డాలర్లకు చేరింది. ఇది పదేండ్లలో 28శాతం వృద్ధిరేటును సూచిస్తుంది. టాప్ టెన్ ఆర్థిక వ్యవస్థలు(అమెరికా, చైనా, జర్మనీ, జపాన్, భారతదేశం, యూకే, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్)లో బ్రెజిల్ అత్యల్ప జీడీపీ వృద్ధిని నమోదు చేసింది. 2015లో 2.1 ట్రిలియన్ల డాలర్లు ఉన్న జీడీపీ 2025లో 2.3 ట్రిలియన్ల డాలర్లకు చేరింది.

# ఆ వ్యాఖ్యలు అమానవీయం

## ఏమాత్రం సున్నితమైనవి కాదు.. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



**మహా :** మహిళల దుస్తులను పట్టుకుని లాగడం, ఛాతి భాగాన్ని తాకడం అత్యాచార నేరం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తీర్పు సందర్భంగా అలహాబాద్ న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని పేర్కొంది. అలహాబాద్ జడ్జి వివాదాస్పద తీర్పుపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం సుమోటోగా స్వీకరించి బుధవారం విచారణ చేపట్టింది. జడ్జి వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసిన ధర్మాసనం, వాటిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రంతోపాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

**జరిగింది ఇదీ**

2021 నవంబరులో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ బాలికను బైక్‌పై ఇంటి వద్ద దింపుతామని ఎక్కించుకుని ఇద్దరు యువకులు అనుచితంగా ప్రవర్తించారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడం వల్ల నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కేసుపై మార్చి 17న విచారణ జరిపింది అలహాబాద్ హైకోర్టు. ఆ సమయంలో జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా, మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ తీర్పు వెలువరించారు. ఈ తీర్పు కాస్త వివాదాస్పదంగా మారింది. న్యాయమూర్తి వ్యాఖ్యలు న్యాయస్థానాలపై గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తమైంది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి కూడా అలహాబాద్ కోర్టు తీర్పుపై స్పందించారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపి స్టే విధించింది.



### తెలంగాణ ప్రభుత్వంతో సిస్కో కీలక ఒప్పందం

**హైదరాబాద్, మహా:** టెక్నాలజీ రంగంలో దిగ్గజం అయిన సిస్కో, తెలంగాణలోని ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి నైపుణ్య శిక్షణను అందించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో స్కిల్స్ యూనివర్సిటీ, సిస్కో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధన్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు, సిస్కో సీనియర్ వైఎస్ ప్రసిడెంట్ డాక్టర్ గయ్ డీడ్రిక్ గై డైడ్రిచ్, ఆ సంస్థ ఇతర ప్రతినిధులతో కీలక సమావేశం జరిగింది. నైపుణ్య శిక్షణ అందించే విషయంలో ఈ సందర్భంగా సిస్కోకు స్కిల్స్ యూనివర్సిటీకి, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ కు మధ్య వేర్వేరు ఒప్పందాలు కుదిరాయి. ఈ సమావేశంలో స్కిల్స్ యూనివర్సిటీ వైఎస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు గారు, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా పాల్గొన్నారు.



### ఐశ్వర్య రాయ్ కారును ఢీకొట్టిన బస్సు

**మహా:** బాలీవుడ్ అందాల తార ఐశ్వర్య రాయ్ కార్ ప్రమాదానికి గురైంది. వెనుక నుంచి వచ్చిన ఓ బస్సు ఆమె కారును ఢీకొట్టింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనితో ఐశ్వర్య అభిమానులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐశ్వర్య లేరని తెలుస్తోంది. అంతేకాదు ఆమె కారుకు కూడా పెద్ద ప్రమాదమేదీ జరగలేదని ఐశ్వర్య రాయ్ టీమ్ మీడియాకు తెలిపింది.

# విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన చేస్తాం

## శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్, మహా:** విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆ రంగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యవస్థలో అవసరమైన ప్రక్షాళన చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. విద్యా రంగంపై శాసనమండలిలో జరిగిన ప్రత్యేక చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. 2021 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో పేర్కొన్న గణాంకాలను సభలో వివరించారు. సబ్జెక్టుల వారిగా తెలంగాణలో ఏ స్థానానికి పడిపోయిందీ తెలిపారు. ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని ప్రదర్శించలేని వారి సంఖ్య పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య తగ్గడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా విధానం కొంత ఆందోళనకరంగా మారింది. ఎవరు అవునన్నా కాదన్నా ఇందులో వాస్తవం ఉంది. విద్యా రంగంలో పడిపోతున్న ప్రమాణాలను పెంచాలంటే కేవలం నిధుల కేటాయింపు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదు. అందరూ ఒక సామాజిక బాధ్యతగా భావించినప్పుడే సమస్యను పరిష్కరించగలుగుతాం. విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు, ప్రక్షాళన చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వండి. అందరి సూచనలతో సమగ్రమైన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించి చర్చిద్దాం. పడిపోతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు మనం ద్రోహం చేసిన వారమవుతాం. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రక్షాళన చేయలేం. విద్యా రంగంలో ప్రమాణాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నిర్వహించి 10 వేల మంది టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశాం. దీనికి సంబంధించి త్వరలోనే విధివిధానాలను ప్రకటిస్తాం. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం” అని వివరించారు.

# లేడీ డాన్ సంగీత సాహు పట్టివేత

- ఒడిశాలో అరెస్టు చేసిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు
- హైదరాబాద్‌లో ఐదు కేసులు నమోదైనట్లు తెలిపిన పోలీసులు
- ఒడిశా వెళ్లి అరెస్టు చేసిన ఎస్టీఎఫ్ పోలీసులు
- నాలుగేళ్ల క్రితం గంజాయి వ్యాపారంలోకి దిగిన సంగీత సాహు



**మహా :** గంజాయి సరఫరా కేసుల్లో నిందితురాలు, గంజాయి లేడీ డాన్ సంగీత సాహును ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమెపై హైదరాబాద్‌లో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఒడిశా వెళ్లిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు, అక్కడి పోలీసుల సహకారంతో ఆమెను అదుపులోకి తీసుకుని నగరానికి తరలించారు. ఒడిశాలోని కుర్ధా జిల్లా, కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు దాదాపు నాలుగేళ్ల క్రితం గంజాయి వ్యాపారంలోకి ప్రవేశించింది. వివిధ రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో సంబంధాలు నెరుపుతూ, వారికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లోని దూల్‌పేటలో ఇద్దరు వ్యక్తులకు 41.3 కిలోల గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబడింది. దూల్‌పేటలో పలువురికి ఆమె గంజాయి సరఫరా చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. సంగీత సాహు ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ నటిలా వీడియోలు పోస్టు చేస్తుందని పోలీసులు పేర్కొన్నారు. కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్న ఆమెను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు.

# ఐపీఎల్ ప్రియులకు గుడ్ న్యూస్

## హైదరాబాద్‌లో మ్యాచ్ ఉంటే స్పెషల్ సర్వీస్




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ఆర్టీసీ తీపి కబురు అందించింది. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లకు వచ్చే క్రికెట్ ప్రేక్షకుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు వచ్చేందుకు గ్రేటర్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హైదరాబాదులో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా క్రికెట్ ప్రేక్షకుల కోసం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పిచనుంది. ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు ఉప్పల్ స్టేడియంకు వెళ్లేవారికి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు గ్రేటర్ ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది.

**ఈ తేదీల్లో స్పెషల్**

గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 స్పెషల్ బస్సులను ఆర్టీసీ నడపనుంది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో ఈ ప్రత్యేక బస్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. మార్చి 27, ఏప్రిల్ 6, ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే 10, మే 20 21 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేసింది ఆర్టీసీ. ఎక్కడ నుంచి : ప్రధానంగా ఘట్‌కేసర్, హయత్ నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎల్బీ నగర్, కోఠి, లక్డీకపూల్, దిల్‌సుఖ్ నగర్, మేడ్చల్, కేపీహెచ్‌పీ, మియాపూర్, జేబీఎస్, ఈసీఐఎల్, బోయిన్ పల్లి, చార్మినార్, చాంద్రాయణ గుట్ట, మెహదీపట్నం, బీహెచ్ఈఎల్ వంటి వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు ఆర్టీసీ స్పెషల్ బస్సు నడపనుంది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | గురువారం, హైదరాబాద్ | 27-03-2025
ANN తెలుగు

EDITORIAL సంపాదకీయం

# సైబర్ నేరాల నుండి రక్షణ మన చేతుల్లోనే..

మనం వాడే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, చార్జింగ్ కేబుల్ డివైజ్ ఏదైనా సరే మనల్ని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. వీరు చేసే మోసాల గురించి అవగాహన కలిగి ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారానే వారికి అడ్డుకట్ట వేయగలమని రిజర్వు బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్లైన్ డబ్బు చెల్లింపులు అతి సర్వ సాధారణం. డబ్బులు అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ఏ విధమైన చెల్లింపులైనా చేసే వెసులుబాటు ఉంది. కిలాడి కేటుగాళ్లు(హ్యాకర్లు) మనం మన మొబైల్ వాడకంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బులు కొల్లగొట్టేస్తారు. మనం చేసే ఏ చిన్న పొరపాటైనా సైబర్ నేరగాళ్ళకు వరంగా మారుతుంది. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి. పాస్‌వర్డ్‌లు బలంగా పెట్టుకోకపోయినా, వారి మాయ మాటలకు పడిపోయినా ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. మన అలసత్వం, అమయాకత్వాన్నే ఆసరాగా చేసుకొని కూర్చున్నచోటి నుంచే కోట్ల రూపాయలు కొల్లగొడుగున్నారు సైబర్ నేరగాళ్లు. వీరి బారి నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు సూచిస్తూ ఆర్బీఐ నివేదికను విడుదల చేసింది.ఆన్ లైన్ మోసం నుండి మనల్ని మనం రక్షించుకొనుటకుగాను కనీస విషయాలు తెలిసి ఉండాలి. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు సెక్యూర్ పేమెంట్ గేట్‌వేస్‌ను ఎంచుకోవాలి.లేదంటే మన సమాచారం మూడో వ్యక్తికి చేరే ప్రమాదం ఉన్నట్టే. మీ పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు, క్రెడిట్ , డెబిట్‌కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లు భద్రంగా ఉంచుకోవాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు..క్రెడిట్ , డెబిట్‌కార్డుల నంబర్లు సహా ఇతర వివరాలు ఎప్పుడూ మీ ల్యాప్‌టాప్స్, డెస్కటాప్స్, వెబ్‌సైట్స్‌లో సేవ్ చేసి పెట్టుకోవద్దు.మీకు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్లు, ఫైళ్లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వాటితో మీ కంప్యూటర్‌లోకి ఫిషింగ్ లింక్‌లు వచ్చే ప్రమాదం ఉంది. కొత్తవారితో మీ చెక్‌బుక్ కాపీలు, కేవైసీ డాక్యుమెంట్లు షేర్ చేయవద్దు. తరచూ మీ పాస్‌వర్డ్‌లు మారుస్తూ ఉండాలి.మీ డివైజ్‌ల్లో మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు తరచూ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలి.మీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లకు తప్పక పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలియని సోర్స్‌ల నుంచి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు. మనం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా 24 గంటలపాటు పనిచేసే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 155260కు ఫిర్యాదు చేయవచ్చు. మన తెలుగు రాష్ట్రాలతో సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉంటాయి. మనం కాల్ చేసిన వెంటనే పోలీసులు మన బ్యాంక్ ఖాతాను స్తంభింపజేస్తారు. దీనివల్ల మరింత సొమ్ము మనఖాతా నుంచి పోకుండా కాపాడుకోవచ్చు.




ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడు వర్చువల్ కీబోర్డు (కంప్యూటర్ స్క్రీన్‌పైన కీబోర్డు కనిపిస్తుంది)ను వాడాలి. సాధారణ కీబోర్డుపై మనం ఏయే నంబర్లు నొక్కామన్నది ఇతరులు తెలుసుకునే అవకాశం ఉంటుంది..

మీరు ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేసిన వెంటనే లాగ్‌అవుట్ కావాలి.

తరచూ మీ పాస్‌వర్డ్‌ను మారుస్తూ ఉండాలి.

ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు మీ ఈమెయిల్‌కు ఒకే పాస్‌వర్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లో పెట్టకోవద్దు.

సైబర్ కేఫ్‌లు, ఇతర పబ్లిక్ కంప్యూటర్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేయకపోవడం ఉత్తమం.

పాస్‌వర్డ్ పక్కాగా ఉండేలా చూసుకోవాలి

మీ పాస్‌వర్డ్ మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు తాళం వంటిది. ఇది పక్కాగా ఉండేలా చూసుకోవాలి.

అవకాశం ఉన్న ప్రతి చోటా టూ ఫ్యాక్టర్(రెండంచెల సెక్యూరిటీ) ఆథంటికేషన్ పెట్టుకోవాలి.

**ఫోన్ హ్యాకింగ్ మార్గాలివే.. జాగ్రత్త**

**ఫేక్ యాప్స్**

సైబర్ క్రిమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లే స్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్ యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది.

**వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ఎంఎస్**

వాట్సాప్, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింక్‌లు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్.



- పిన్నింటి బాలాజీ రావు
భౌతికరసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు
9866776286

**సిమ్ కార్డ్ స్వాప్**

మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సిస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి. అయితే ప్రస్తుతం సిమ్ తీసుకోవాలంటే ఆధార్ లింక్, బయో మెట్రిక్ తప్పనిసరి కావడంతో ఈ ప్రమాదం కొంత వరకు తగ్గుతుంది. కానీ సిమ్ క్లోనింగ్ అనే మరో ప్రక్రియ ద్వారా మన సిమ్ యాక్టివ్‌లో ఉండగానే, మన నంబర్‌తోనే ఇంకో సిమ్ క్రియేట్ చేసే టెక్నాలజీ కూడా వచ్చింది. ఇది ఇంకా డేంజర్. అందుకే ఆధార్ నంబర్ లాంటి మన పర్సనల్ డేటాను లీక్ కాకుండా చూసుకోవాలి.

**బ్లూటూత్ హ్యాకింగ్**

బ్లూటూత్ సహాయంతో కూడా హ్యాకర్లు ఒక నిర్ణీత దూరంలో ఉన్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసే చాన్స్ ఉంది. ఇందుకోసం హ్యాకర్లు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ హ్యాకింగ్ ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంది. పబ్లిక్ వైఫైని వాడే వాళ్లు హ్యాకర్లకు ఈజీ టార్గెట్ అవుతారు. అందుకే పబ్లిక్ వైఫైని వాడకపోవడం మంచిది. అలాగే మీ వైఫైని ఓపెన్‌గా వదిలేయకుండా ఉండాలి. కచ్చితంగా స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి.సైబర్ నేరాల గురించి సరైన అవగాహన పెంచుకుని ఎవరికి వారు రక్షించు కోవాల్సిన ఆవశ్యకత ఉంది.

# భారత్ తరహాలో అమెరికా ఎన్నికలు

## ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్

**మహా:** సంచలనాలకు కేరాఫ్ గా నిలుస్తున్న డొనాల్డ్ ట్రంప్ అమెరికా ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగానే ఆయన ఎన్నికల ప్రక్రియలో భారీ మార్పులు చేయడానికి సిద్ధమయ్యారు. ఇక నుంచి ఓటు నమోదు కోసం పౌరసత్వం రుజువు చూపడం తప్పనిసరి చేస్తూ.. ట్రంప్ మంగళవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఇండియా, బ్రెజిల్ వంటి దేశాలను ఉదాహరణగా చూపించి అక్కడ ఈ ప్రక్రియలో ఎన్నికలు నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. ''స్వయంకృషి ఆధారంగా మనం ఇతరులకు మార్గదర్శకంగా ఉన్నప్పటికీ, ఆధునిక, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఎన్నికల ప్రక్రియలో అనుసరిస్తున్న ప్రాథమిక నిబంధనలను మనం అమలు చేయడంలో విఫలమయ్యాం. ఉదాహరణకు.. భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఓటర్ల గుర్తింపును బయోమెట్రిక్ డేటాబేస్‌తో అనుసంధానిస్తున్నాయి. కానీ, మనం స్వీయ ధ్రువీకరణపై ఆధారపడుతున్నాం. అలాగే, జర్మనీ, కెనడా వంటి దేశాలు పేపర్ బ్యాలెట్ల పద్ధతిని అనుసరిస్తున్నా.. మన ఎన్నికల ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయి'' అని ట్రంప్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.



### ఓటర్లు తమ అమెరికా పౌరసత్వాన్ని రుజువుగా చూపాలి

ఇకపై ఓటర్లు తమ అమెరికా పౌరసత్వాన్ని రుజువుగా చూపించాల్సి ఉంటుంది. అంటే, ఓటర్లు తమ యూఎస్ పాస్‌పోర్ట్ లేదా జనన ధ్రువీకరణ పత్రాన్ని చూపించి తమ పౌరసత్వం నిర్ధారించాలి. అదేవిధంగా.. ఎన్నికల సమయంలో అమెరికా పౌరులు మాత్రమే విరాళాలు ఇవ్వాలని, మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని ట్రంప్ నిర్ణయించారు. ఈ కొత్త నియమాలు ప్రకారం.. మెయిల్ ద్వారా వచ్చిన ఓట్లను ఎన్నికల రోజు నాటికి మాత్రమే లెక్కించాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో ఎన్నికల రోజు తర్వాత వచ్చిన ఓట్లను కూడా అంగీకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి ట్రంప్ గతంలో మాట్లాడుతూ.. ''మోసాలు లేకుండా, సూటిగా, న్యాయపరమైన ఎన్నికలు నిర్వహించడం మన బాధ్యత. నిజమైన విజేతను నిర్ణయించడానికి ఈ మార్పులు అత్యంత అవసరం'' అని పేర్కొన్నారు. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత ట్రంప్ ఎన్నికల విధానంపై అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ట్రంప్ ఎన్నికల నిర్ణయంపై రిపబ్లికన్ చట్టసభ సభ్యులు మద్దతు తెలిపారు. ఇది ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుందని వారు అభిప్రాయపడారు. జార్జియా విదేశాంగ కార్యదర్శి బ్రాడ్ రాఫెన్స్‌పెర్గర్ ఈ ఉత్తర్వు ద్వారా అమెరికా పౌరులు మాత్రమే దేశంలో జరిగే ఎన్నికల ఫలితాలను నిర్ణయించేందుకు అవకాశం ఇస్తుందని తెలిపారు. మరోవైపు డెమొక్రాట్లు ఈ ఉత్తర్వులను వ్యతిరేకించారు. వారు ఈ మార్పు వల్ల కొంతమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతారని పేర్కొన్నారు. 2023లో జరిగే నివేదిక ప్రకారం.. అర్హత కలిగిన అమెరికా పౌరులలో తొమ్మిది శాతం మందికి పౌరసత్వ రుజువు లేదని వెల్లడించారు. మరోవైపు 18 రాష్ట్రాలలో.. ఎన్నికల రోజు తర్వాత వచ్చిన మెయిల్ ఓట్లను అంగీకరిస్తున్నాయి. ట్రంప్ ఈ విధానాన్ని ఇకపై రద్దు చేయాలని నిర్ణయించారు. కొలరాడో డెమోక్రటిక్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జెనా గ్రిస్వోల్డ్ ఈ ఉత్తర్వును చట్టవిరుద్ధమైనదిగా అభివర్ణిస్తూ.. ఇది ఓటర్ల సంఖ్యను తగ్గించేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు.

# వేసవిలో.. రయ్ రయ్

## విమానాల్లో.. విహారయాత్రలు



వేసవిలో.. ఇండియాలో ఎండలు అదరగొడతయా. ఈ ఎండల్లో చాలా మంది విదేశీ విహార యాత్రలకు వెళ్లడానికి ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి ప్రజలు పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చాక విదేశాలకు వెళ్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో విమానాల్లో రద్దీ నెలకొంటుంది. ఈ నేపథ్యంలో వేసవిని దృష్టిలో ఉంచుకును విమాన సర్వీసులు పెంచుకోవాలని విమానయాన సంస్థలు నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు చర్యలు ప్రారంభించినట్లు డీజీసీఏ స్పష్టం చేసింది. భారతీయ విమానయాన సంస్థలు వేసవి కాలం రద్దీ నేపథ్యంలో అదనపు సర్వీలు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ సర్వీసులు గత సంవత్సరంతో పోలిస్తే వారపు విమానాలలో 5.5 శాతం పెరుగుదల ఉందని పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ ఈ మేరకు స్పష్టం చేసింది. డీసీసీఏ తెలిపిన వివరాల ప్రకారం 2025 మార్చి 30 నుంచి అక్టోబర్ 25 వరకు నడిచే వేసవి కాలంలో భారతీయ విమానయాన సంస్థలు 129 విమానాశ్రయాల నుంచి 25,610 వీక్లీ ఫ్లైట్స్‌ను నడుపుతాయని వివరించారు. ఫిబ్రవరి 2025లో జరిగిన స్లాట్ కాన్ఫరెన్స్ సమావేశం తర్వాత దేశీయ విమానయాన సంస్థ షెడ్యూల్ ఖరారు చేసింది. సాధారణంగా వేసవిలో భారతీయ విమానయాన సంస్థలు విమాన ట్రాఫిక్‌లో పెరుగుదల కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది రద్దీకు అనుగుణంగా వారానికి 25,610 విమానాలు నడపాలను నిర్ణయం తీసుకున్నారు. గత సంవత్సరం వారానికి 24,275 ఫ్లైట్స్‌తో పోలిస్తే ఇది 5.5 శాతం ఎక్కువ. 129 విమానాశ్రయాలలో విమానయాన సంస్థలు ప్రతిపాదించిన కొత్త విమానాశ్రయాలు ఉన్నాయని డీజీసీఏ పేర్కొంది. అంబికాపూర్, దాటియా, బీదర్, పోర్బందర్, పాక్యాంగ్, రేవా, సోలాపూర్ విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడపనున్నట్లు వివరించింది. అయితే అజంగఢ్ మరియు రుప్సి విమానాశ్రయాల నుండి కార్యకలాపాలు 2025 వేసవి షెడ్యూల్‌లో నిలిపివేశారు. ఇండిగో అత్యధిక సంఖ్యలో వీక్లీ డొమెస్టిక్ ఫ్లైట్స్‌ను డీజీసీఏ డేటా ద్వారా తెలుస్తుంది. 14,158 నిష్క్రమణలు షెడ్యూల్ చేసిందని, తర్వాత స్థానంలో ఎయిర్ ఇండియా (4,310), ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (3,375) ఉన్నాయని డీజీసీఏ పేర్కొంది. అలాగే స్పైస్‌జెట్ స్లాట్‌లు గత సంవత్సరం 1,657 నుంచి ఈ సంవత్సరం 1,240కు తగ్గాయి. అలయన్స్ ఎయిర్, ఫ్లైబిగ్ వంటి ప్రాంతీయ విమానయాన సంస్థలు షెడ్యూల్ చేసిన నిష్క్రమణలలో వరుసగా 41.96 శాతం, 30.98 శాతం తగ్గుదలని నమోదు చేసిందని డీజీసీఏ పేర్కొంది. గత సంవత్సరం వేసవి షెడ్యూల్‌లో 20 ఎగ్జిట్లతో పోలిస్తే ఫ్లై 91 వంటి విమానయాన సంస్థలు 123 ఎగ్జిట్లను అనుమతించడంతో 515 శాతం గణనీయమైన వృద్ధిని సాధించాయని డీజీసీఏ తెలిపింది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం

- ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి
- ఆమె భర్తకు, ట్రాక్టర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు
- సహాయ చర్యలు చేపట్టిన పోలీసులు



**రంగారెడ్డి జిల్లా, మహా :** షాద్ నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం తిమ్మాపూర్ జాతీయ రహదారి పై రోడ్డుప్రమాదం జరిగింది. మహేశ్వరం మండలం ఎన్డీ తండాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సక్కుబాయి (35), హైదరాబాద్ లోని అంబర్ పేట్ లో ఏఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఆమె భర్త పాండు కలిసి కొందుర్గులోని తమ భూమిలో తోట పనులను పరిశీలించేందుకు వెళ్లి సాయంత్రం స్కూటీపై తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి, జాతీయ రహదారిపై తిమ్మాపూర్ వద్ద హైదరాబాద్ వైపు ఒకే వరసలో స్కూటీ, ట్రాక్టర్, లారీ వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి ట్రాక్టర్ ను ఢీకొట్టి, వీరి వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సక్కుబాయి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె శరీరం రెండు ముక్కలైంది. భర్త పాండు, ట్రాక్టర్ డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# వేసవిలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ హెచ్. ప్రణీత్

ఏటూరునాగారం, మహా; వేసవిలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొండాయి వైద్యాధికారి హెచ్ ప్రణీత్ కుమార్ అన్నారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.బుధవారం మల్యాల ఆశ్రమ పాఠశాలలో ఉన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి మందులు మరియు ORS ప్యాకెట్ లను ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.ఎండలో బయట తిరగకూడదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శేషయ్య,టీచర్ వేణుగోపాల్ Anm సమ్మక్క, నాగమణి, ఆశలు భాగ్య,సునీత పాల్గొన్నారు.

# గోవిందాద్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి




**వరంగల్, మహా :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వరంగల్ నగరంలోని ప్రాచీన దేవాలయమైన గోవిందరాజు స్వామి (గోవిందాద్రి) దేవాలయంలో జరిగే తేదీ 06042025 నుంచి 26042025 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను బుధవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ & అటవీ, పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ఆలయ ప్రధాన అర్చకులు వరియోగుల శ్రీనివాస స్వామి తో కలిసి ఆవిష్కరించారు. మంత్రి ఏకైక పుత్రిక కొండా సుష్మిత పటేల్ జన్మదినం సందర్భంగా వేద ఆశీర్వచనం నిర్వర్తించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులతో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయడానికి వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తనాజీ వాకుడే తో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో సంప్రదింపులు జరిపి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి వారికి తెలిపారు. అలాగే విద్యుత్ అలంకరణ, పారిశుద్ధ్యమ ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యం, పోలీస్ ఫికెటింగ్, ఏర్పాటు చేయిస్తామని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేస్తామని రథం కొరకు నేను గతంలో గది ఏర్పాటు చేశానని ఆ రథం మళ్లీ ఆ రూమ్ నుండి బయటకి తీసుకొచ్చి నగరవ్యాప్తంగా రథోత్సవం నిర్వహించాలని స్థానికంగా ఉన్న భక్తులు ముదిరాజ్ కులస్తులు స్వచ్ఛందంగా రథోత్సవంలో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా గోవిందరాజస్వామి దేవాలయాన్ని ఆర్థికంగా పరిపుష్టి కలిగిన ఆలయాలకు అడాప్ట్ చేసి ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న అర్చకులకు వేతనాలు వచ్చే విధంగా అదేవిధంగా ధూపదీప నైవేద్యాలు జరిగే విధంగా దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీధర్ తో మాట్లాడి నివేదిక కోరుతామని జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాముల సునీత తో మాట్లాడి సమగ్రమైన నివేదిక కోరుదామని మంత్రి పేర్కొన్నారు.

# శానిటేషన్ లో పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలి

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- షెడ్యూలు పాటించని జవాన్ కు షోకాజు నోటీసు



**వరంగల్, మహా :** గ్రేటర్ వరంగల్ నగరంలో సమర్థంగా శానిటేషన్ నిర్వహణలో భాగంగా శానిటేషన్ అధికారులు, సిబ్బంది పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధి 61వ డివిజన్ సిద్ధార్థ నగర్ లో బుధవారం కమిషనర్ సానిటేషన్ తో పాటు ట్రేడ్, ఆస్తి పన్నుల వసూళ్ల తీరును క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన జవాన్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వార్డు లో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు అయ్యేలా చూడాలని, పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్ లకు చెందిన లాగ్ బుక్ ఖచ్చితంగా నిర్వహించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని, ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిపు లు వేయాలని సూచించారు. ఆస్తి, ట్రేడ్ పన్ను వసూళ్ల కు ఏర్పాటు చేసిన బృందాలు ఖాజీపేట పరిధి లో 6 బృందాలు, కాశీబుగ్గ పరిధిలో ఏర్పాటు చేసిన 5 బృందాలు ప్రతి రోజు రూ. 50 లక్షల చొప్పున ఆస్తి, ట్రేడ్ పన్నులు వసూళ్లు జరుపుతూ, దానికి సమాంతరంగా శానిటేషన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సిద్ధార్థ నగర్ లో ఇంటి నిర్మాణానికి రోడ్డు మీద ఇసుక వేసి నిర్మాణం చేస్తున్న యజమానికి పెనాల్టీ విధించాలని కమిషనర్ సి ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజా రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

# ఓటిఎస్ ను సద్వినియోగం చేసుకోండి

- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే..సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే



**వరంగల్, మహా :** వన్ టైం సెటిల్మెంట్ (ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని పన్ను పై 90% వడ్డీ మాఫీ పొందాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 2024 25 ఆర్థిక సంవత్సరం నకు చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90% పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు వడ్డీ/పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు సంబంధించి, బకాయిలపై 90% వడ్డీ/పెనాల్టీలను మాఫీ చేయడం జరుగుతుందని, ఇదివరకే పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగిందని, ఈ సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే వర్తిస్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

### కరీంనగర్ నగరపాలక సంస్థ మురుగు నీటి శుద్దీకరణ కేంద్రాన్ని

# సందర్శించిన కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్



**కరీంనగర్, మహా:** స్థిరమైన పారిశుధ్య పద్ధతులను ప్రోత్సహించమే లక్ష్యంగా మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రాన్ని నిర్మాణం చేయడం జరుగుతుందని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా నూతనంగా మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రం నిర్మాణం కు గతంలోనే శ్రీకారం చుట్టింది. నగరపాలక సంస్థ కు చెందిన మురుగు నీటి శుద్దీకరణ కేంద్రం ఆవరణలో నిర్మాణం చేస్తున్న మల స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లతో కలిసి బుధవారం రోజు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ సందర్శించారు. మానవ వ్యర్థాల శుద్దీకరణ నిర్మాణం పనులను తనిఖీ చేసి పరిశీలించారు. ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి... పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రం పనుల పై అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సలహాలు సూచనలు చేసి... పనుల వేగవంతం పై కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. నాలుగు నెలల వ్యవదిలో ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం పనులను పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, మాన్యూవల్ స్కావెంజిగ్ నిర్మూలణ, సామాజిక ఆర్థిక పురోగతి, జల వాతావరణ కాలుష్య నివారించడానికే మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రాలు సృష్టించ బడ్డాయని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ప్రభుత్వం నగరపాలక సంస్థ లో స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ ఎస్ టీ పి) నిర్మాణం కు చర్యలు తీస్కుందన్నారు. నగరపాలక సంస్థ మురుగు నీటి శుద్దీకరణ కేంద్రం ఆవరణలోనే మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రం ను నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎకరం స్థలంలో స్లడ్జ్ కలెక్షన్ ట్యాంక్, స్లడ్జ్ ను ఎరువుగా మార్చేందుకు సోలార్ షెడ్లు, వే బ్రిడ్జ్ నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి, ఆపరేటింగ్ రూం, టాయిలెట్స్ నిర్మాణం చేసి ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకులు, పబ్లిక్ టాయిలెట్స్, కమ్యూనిటీ టాయిలెట్స్ నుండి సెప్టిక్ క్లీనర్ ట్యాంకర్ల ద్వారా సేకరించిన మానవ వ్యర్థాలను ప్లాంట్ లో శుద్దీకరణ చేసి.... ఎరువుగా మార్చేందుకు చర్యలు తీస్కోవడం జరుగుతుందని తెలిపారు. మానవ వ్యర్థాల శుద్దీకరణ కేంద్రం నిర్మాణం కు సంబంధించిన పనులను అధికారులతో కలిసి తనిఖీ చేసి పరిశీలించామని తెలిపారు. ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం పనులను 4 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని... పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏజెన్సీ కాంట్రాక్టర్ అధికారులను ఆదేశించామని తెలిపారు. సెప్టిక్ ట్యాంకు క్లీనర్ల ద్వారా సేకరించిన మానవ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం ద్వారా వాతావరణ కాలుష్యం తో పాటు ఉపరితల భూగర్భ జలాలు కలిషితం కాకుండా మానవ వ్యర్థాలను శుద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యర్థాలను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా ఎరువుగా మార్చే అవకాశం ఉందని అలాంటి ఎరువును మొక్కలకు వాడుకునే వీలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, ఎస్ టిపి ప్లాంట్ ఉద్యోగులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### నిర్లక్ష్యానికి నిలువుట్టాదాంగా

# మేళ్లచెరువు తహసీల్దార్ కార్యాలయం

- నేను ఇంతే నా రూటే సపరేటూ అంటున్న ఓ..అధికారి
- ఇంతకీ ఎవురా ఆ అధికారి.?



**హుజూర్ నగర్, మహా :** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్.ఐ మోసిన్ బాబా పనితీరు ఇలానే ఉందని చెప్పాలి సమస్యలపై కార్యాలయంనికి వచ్చిన వారిపై నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం అయన స్టయిల్ ఆయన ఆఫీసుకు అందుబాటులో లేని సమయంలో బాధితులు పలుమార్లు ఫోన్లు చేసిన స్పందించదని ఈయన గారిపై ఎన్నో ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు త్వరితగతిన సేవలు అందించేలా ఆర్.ఐ మోసిన్ బాబా ప్రవర్తన మార్చుకునేలా ఉన్నత స్థాయి అధికారులు స్పందించాలని పలువురు కోరుకుంటున్నారు.

# ట్రాక్టర్ ఢీకొని మహిళకు గాయాలు



**హుజూర్ నగర్, మహా :** మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో బుధవారం ఉదయం సుమారు ఆరున్నర గంటల సమయంలో మఠంపల్లికి చెందిన దైద మానస భర్త భాలస్వామి వయసు( 32) సంవత్సరాలు అను ఆమె మఠంపల్లి నుండి రోజు వారిగా ఆటోలో కొంతమంది కూలీల తోటి కృష్ణాపురం గ్రామానికి మిరపకాయ కూలీకి వెళుతుండగా రఘునాథపాలెం గ్రామానికి చెందిన నాయుడు గురవయ్య తండ్రి శ్రీను అనే వ్యక్తి రఘునాథ పాలెం గ్రామంలో ప్రధాన రహదారిలో తన ట్రాక్టర్ ను అజాగ్రత్తగా నడిపి ఆటోను ఢీకొట్టడం జరిగింది. మానస కుడికాలకు బలమైన గాయమైన గాయం కాగా హుటా హుటిన సూర్యాపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు అంబులెన్సులు తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం ప్రణాప్రాయ స్థితిలో ఉన్న ఆమెను మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ కు తీసుకువెళ్లడం జరిగిందని ఇట్టి ప్రమాదంపై వారి కుటుంబ సభ్యులలో మానసకు వరుసకు మామ అయిన దైద రాయులు తండ్రి ఆర్లప్ప అనే వ్యక్తి దరఖాస్తు ఇవ్వగా మఠంపల్లి ఎస్సై పీ.బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు

### హై వోల్టేజీ కరెంటు సరఫరాతో

# పలు ఇండ్లలో కాలిపోయిన ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువులు




**హుజూర్ నగర్, మహా :** హుజూర్నగర్ పట్టణంలో 16, 17, 18 వార్డుల్లో ఒక్కసారిగా పెరిగిన కరెంట్ హై వోల్టేజీ వల్ల పలువురి ఇండ్లలో ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. సాధారణంగా 240వాట్ల విద్యుత్ ఇళ్లలోకి సరఫరా కావలసి ఉండగా ట్రాన్స్ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తెగిపోయి మెయిన్ వైర్ పై పడడంతో ఒక్కసారిగా 400 వాట్ల విద్యుత్ ఇండ్లలోకి సరఫరా కావడంతో పలువురి ఇండ్లలో టీవీలు, ఏసీలు, డిష్ లు, ఫ్రిజ్లు, కూలర్లు,ఫ్యాన్లు కాలిపోయాయి. ఈ సంఘటనతో భయాందోళనకు గురైన ప్రజలు రోడ్ల మీదికి చేరారు.

# కోతులు గీకుతున్నాయ్.. కుక్కలు కరుస్తున్నాయ్




- క్రూరంగా మారుతున్న జీవాలు
- రోజురోజుకు పెరుగుతున్న మంకీ, డాక్ బైట్ కేసులు
- 3నెలల్లో కోతులు, కుక్కల బారిన పడిన 1839మంది
- జిల్లా ఆస్పత్రిలో భారీగా నమోదవుతున్న కేసులు
- పట్టింపేలేని అధికారులు



**ములుగు, మహా :** అడవుల్లో ఉండాల్సిన కోతులు పట్టణాలపై పడుతున్నాయి. వీధికుక్కలు వికృతరూపం దాల్చుతున్నాయి. ములుగు జిల్లాలో కోతులు, కుక్కల దాడిలో గాయపడినవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి కోతులను పట్టుకొని ములుగు సమీపంలో వదిలి వెళ్తుండటంతో ఆహారం కోసం ఇళ్లపైకప్పులను పీకిపారేస్తున్నాయి. మనుషుల వద్ద ఏమి ఉన్నా లాక్కొని కరిచేందుకు దూకుతున్నాయి. వీధి కుక్కల గురించి చెప్పాల్సిన పనిలేదు. గుంపుగా మారి మనుషులపై దాడి చేస్తున్నాయి. ఇళ్ల ఆవరణలోకి వచ్చి మరీ చిన్నారులు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. కోతులు, కుక్కలపై పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఒకటి కాదు రెండు కాదు మూడు నెలల కాలంలో కోతులు, కుక్కల బారినపడిన వారి సంఖ్య వేలల్లో ఉంది. కేవలం ములుగు జిల్లా ఆస్పత్రిలోనే 1839కేసులు నమోదయ్యాయంటే ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**మూడు నెలల్లో 1839మందిపై దాడి..**

కోతులు, కుక్కల బెడద వీపరీతంగా పెరిగిపోతోంది. జనవరి నుంచి మార్చి 23వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో నమోదైన కేసులు 1839గా వైద్యాధికారులు వెల్లడించారు. మహిళలు, పురుషులు, చిన్నారులను టార్గెట్ చేస్తూ కోతులు, కుక్కలు విరుచుకుపడుతున్నాయి. ఏవైనా తినుపదార్థాలు ఉంటే బెదిరించి మరీ లాక్కెళ్తున్నాయి. కోతులు గుంపులుగా వెళ్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. విద్యాసంస్థలు, హాస్టళ్లు, కాలనీల్లో విచ్చలవిడిగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. ములుగు జిల్లా ఆస్పత్రిలో జనవరి నుంచి ఇప్పటి వరకు అధిక సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. కోతులు జనవరిలో 191, ఫిబ్రవరిలో 185, మార్చిలో 199 మొత్తం మూడు నెలల్లో 575మందిని కరిచాయి. అదేవిధంగా కుక్కలు జనవరిలో 562, ఫిబ్రవరిలో 404, మార్చి 23 వరకు 298 కేసులు నమోదయ్యాయి. మొత్తం 1839 కోతులు, కుక్కల బారినపడి గాయపడ్డారు. వీరికి ఆస్పత్రిలో విడతల వారీగా వ్యాక్సిన్ వేస్తున్నారు.

**కుక్కల్లో అలపేసియా వ్యాధి సోకుతోంది**

**: జిల్లా వెటర్నర్ అధికారి కొమురయ్య**

ప్రస్తుతం వేసవి కాలంలో వివిధ ప్రాంతాల్లో ఆహారం తీసుకుంటున్న నేపథ్యంలో కుక్కలకు అలపేసియా వ్యాధి సోకుతోంది. ఇళ్లలో పెంచుకునే కుక్కలతోపాటు వీధి కుక్కలకు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏఆర్వీ వ్యాక్సిన్ అందించాలి. పెంపుడు కుక్కల యజమానులు తమ ఆస్పత్రులకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. గ్రామస్థులు, జీపీ అధికారులు సంయుక్తంగా కుక్కలకు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏఈఆర్వీ వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలి. వ్యాధి సోకిన తరువాత ఏఆర్వీ వ్యాక్సిన్ పనిచేయదు.

**వారంలో సమస్య పరిష్కరిస్తాం.. :**

**పి. రఘు, పంచాయతీ కార్యదర్శి, ములుగు**

ములుగు జిల్లా కేంద్రంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. వారం రోజుల్లో కుక్కలు, కోతులు పట్టేవారిని పిలిపించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.



### క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని

# విజయవంతం చేయండి

**హుజూర్ నగర్, మహా :** కోదాడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఈ నెల 28 వ తేదీన నిర్వహించు క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ కోరారు. బుధవారం లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఏర్పాటుచేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు శరీరంలో చాలా రకాలుగా వుండ వచ్చనీ కానీ కొన్ని సాధారణ లక్షణాలు నిరంతర అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, జ్వరం, రాత్రివేళ చెమటలు, మరియు శరీరంలో ఏదైనా భాగంలో గడ్డలు లేదా వాపు స్త్రీలలో రొమ్ములలో గడ్డలు, రొమ్ములలో నొప్పి, కొన్ని సందర్భాల్లో, లైంగిక సంబంధం తర్వాత రక్తం రావడం, యోని నుండి దుర్వాసనతో కూడిన పీచు పదార్థం రావడం, నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, బరువు తగ్గడం, అలసట వంటి లక్షణాలు గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు గాను, నోటిలో గాయాలు ,నోటిలో వాపు,మింగడంలో ఇబ్బందులు వున్న క్యాన్సర్ లక్షణాలుగా భావించి మీకు అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తలను సంప్రదించి 28న కోదాడ నిర్వహించే క్యాన్సర్ వైద్య శిబిరానికి రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ ప్రియ, సిహెచ్ఓ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు రత్న మేరి,ఎరగాని శివ ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

### రైతువారిదిని ప్రారంభించిన

# అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మహా :** సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరమైనవని పోషకాలిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు వారిది కేంద్రాన్ని నిర్వాహకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలని అనుకుంటున్నాడని ఆరోగ్యకరమైన వాతావరణ కల్పనకై కృషి చేస్తున్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. దేశ విదేశాల్లో సైతం ప్రజలందరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కోరుకుంటున్నారని ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించాలంటే కాలుష్య నివారణ జరగాలని సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పలు పంటలను వినియోగించాలని తద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. నేటికీ మన భారతదేశంలో పలు గ్రామాలలో, పట్టణాలలో మహానగరాల సైతం సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలను వినియోగించడం చాలా మంచి పరిణామమని ఈ ప్రక్రియ అనేది దేశవ్యాప్తంగా కొనసాగించినట్లయితే రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన వారవతామని రైతాంగానికి చేయూతనిచ్చిన వారంతామని చెప్పారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం సేంద్రియ ఆహారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ సేంద్రియ ఆహారం పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ప్రత్యేక కమిషన్లు ఉన్నాయని వీటి ద్వారా సేంద్రీయ ఎరువుల ద్వారా పండించే పంటలకు రైతుల్లో విశ్వాసం నింపుతున్నారని చెప్పారు. దేశ విదేశాల్లో సైతం సేంద్రియ ఆహారానికి చాలా ఉత్సాహం చూపెడుతున్నారని, ఖరీదైనప్పటికీ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు . ప్రజలందరూ సేంద్రియ ఆహారాన్ని అలవాటుగా చేసుకోవాలని ముఖ్యంగా మిల్లెట్స్ చాలా క్రేజ్ ఉందని ఈ మిల్లెట్స్ ద్వారా చాలామందికి రోగనిరోధక శక్తి పెంపొందించడమే కాకుండా మన ఆయుష్షును సైతం ప్రభావితం చేస్తున్నదని చెప్పారు. ప్రారంభోత్సవ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించి హర్షం వ్యక్తం చేస్తూ ప్రాచీన పద్ధతుల ద్వారా తయారు చేయడం హర్షించదగ్గ విషయమని నేటి తరానికి ఇవి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. స్టాల్ నిర్వాహకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త నాగి శేఖర్ శ్రేయోభిలాషులు సిబ్బంది పాల్గొన్నారు..



## రైతుల సమస్యల పరిష్కారం కోసం 28న నిరసన దీక్ష

- రైతాంగ సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని , అందుకే రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో ఈ నెల 28 న కరీంనగర్లోని కలెక్టరేట్ వద్ద రెండు గంటల నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం రోజున కరీంనగర్ లోని బిజెపి జిల్లా కార్యాలయంలోకిసాన్ మోర్చా నాయకులు, ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూరైతు ల సమస్యల పరిష్కారం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చిత్త శుద్ధి లేదన్నారు. ప్రధానంగా రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉందని , నేటికీ జిల్లాలో వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం రైతులు కాళ్ళ అరిగేలా సంబంధిత కార్యాలయాలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, రైతు భరోసా విషయంలో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని గోసపెడుతుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని , రైతు రుణమాఫీ, రైతు భరోసా అంశాలలో రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇట్టి నిరసన దీక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలో రావడానికి ఎన్నో మాయమాటలు చెప్పి , అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధానంగా ఆరూ గ్యారంటీలు, 420 హామీలు, అడ్డగోలు వాగ్దానాలతో ప్రజలను నయవంచన గురి చేసిందన్నారు. అన్నం పెట్టే రైతన్నను కూడా తీవ్రంగా మోసం చేసిందన్నారు. రుణమాఫీ పై అనేక ఆంక్షలు , కోర్రిలు, నిబంధనలు పెట్టి రైతాంగాన్ని ఏడిపిస్తుందన్నారు. సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లక్షల పై రుణం ఉన్నవారికి, రుణమాఫీ వర్తించదని ప్రకటన చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ చేస్తామని, నేడు కొందరికే రుణమాఫీ చేస్తూ రైతులను కాంగ్రెస్ సర్కార్ నట్టేట మోసం చేసిందని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి , జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి , మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కరివేద మహిపాల్ రెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి లతోపాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్ నివారణకు యూటర్న్ ల వద్ద చర్యలు

### డీఎస్పీ వెంకటేశ్వర్ రావు



**ములుగు, మహా :** జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ ఎన్ .రవీందర్ తెలిపారు. ములుగు ఎస్‌హెచ్‌వో సీహెచ్ .వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో బుధవారం ములుగు మండలం జంగాలపల్లి క్రాస్, పెట్రోల్ బంకు, కాశిందేవిపేట క్రాస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. యూటర్న్ లవద్ద వచ్చీ పోయే వాహనదారులకు డివైడర్ పై ఉన్న ఇనుప బారికేడ్ ల వల్ల అవతలి వైపు వాహనాలు కనిపించడంలేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిని తొలగించారు. యాక్సిడెంట్ స్పాట్ లను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ 163పై ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రోడ్లలో ఉండే గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ క్లబ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతీ క్లబ్ కి ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గ్రూప్ లో గ్రామానికి సంబంధించిన గ్రామ పోలీసు అధికారి, గ్రామస్థాయి ఉద్యోగులు, రోడ్డుకు ఇరువైపుల ఉండే షాపుల యజమానులు ఉంటారని, అందరూ కలిసికట్టుగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా ఎవరైనా యాక్సిడెంట్ అయిన విషయం చూసినా, తెలిసినా వెంటనే ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాన్ని కాపాడటంలో పోలీసులకు సహకరించాలన్నారు.

## తండ్రి మందలించాడనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని దత్తప్పగూడెం గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. ఇంట్లో పెద్దలు తిట్టారని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు, దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ప్రజ్వల్ (20), తండ్రి సిల్వరాజు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని భువనగిరి ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ప్రజ్వల్ గ్రామంలో మొబైల్ రిపేర్ పనులు చేసుకుంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. అయితే, ఇంట్లో తండ్రి మందలించడంతో మనోవేదనకు గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనతో దత్తప్పగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. తన కుమారుడి మృతిపై మాకు ఎలాంటి అనుమానాలు లేవని తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నమని ఎస్సై డి నాగరాజు, విలేకరులకు తెలిపారు.

## ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న

### జిల్లా కలెక్టర్, ఎస్పి



**హుజూర్ నగర్,మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హుజూర్ నగర్ నియోజక వర్గ కేంద్రంలో 30 వ తేదీ రాక సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. సభ స్థలి వద్ద ఏర్పాటు చేస్తున్న సెక్టార్లను , అని అప్రోచ్ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. విఐపి పార్కింగ్ హెలి పాడు వద్ద పరిసరాలను చుట్టుప్రక్కల పరిశుభ్రపరచాలనీ హెలిపాడు నుండి సభా వేదిక వరకు అప్రోచ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి క్యూరింగ్ చేయాలని తెలిపారు. ఫ్లెడ్ లైట్ల ఏర్పాటు త్వరగా పూర్తిచేయాలన్నారు. పార్కింగ్ స్థలాలను శుభ్రం చేసి బారికెట్స్ ఏర్పాటు . పార్కింగ్ ప్లేస్ ల నుండి సభా స్థలం వరకు అన్ని రోడ్లు ఎలాంటి ఆట ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ నాగార్జున్ రెడ్డి, కమలాకర్, కవితా, సైదులు సురేందర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి. ఆయాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ యువత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించారని అన్నారు. 6 వేల కోట్లతో ప్రారంభించిన రాష్ట్రంలోని అర్హులైన యువకులకు 50 వేల నుండి 4లక్షల ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గుర్తు చేశారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఇంటర్నెట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారని వివరించారు. లోన్ మొత్తాన్ని బట్టి 60 నుంచి 80 శాతం వరకు ప్రభుత్వమే సబ్సిడీ వస్తుంది. ఈ పథకం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన 5 లక్షల మంది నిరుద్యోగులు లబ్ది పొందనున్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

### విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. కేసుల్లో భాగంగా అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చింతకుంట లోని అంబేద్కర్ భవనాన్ని వినియోగం లోకి తీసుకురావాలని, భగత్ నగర్లో కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మించాలని సభ్యులు కోరారు. కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం కూడలి శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ అంశాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సభ్యులకు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను సంవత్సరం వారీగా వెల్లడించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేష్, పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడికి ఆర్థికసహాయం




**హుజూర్నగర్, మహా :** హుజూర్నగర్ మండలం వేపల సింగారం గ్రామనికి చెందిన ఉల్లెందుల రాజేష్ గత కొంతకాలంగా ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితమైన ఇతనికి ఆర్థిక సహాయం అందించేవారు ఎవరు లేక ఎదురుచూపులు చూస్తున్న సమయంలో తోటి స్నేహితులు కలిసి చదువుకున్న రోజులు అతనికి జ్ఞాపకం చేశారు. మేమున్నాము అంటూ పూర్వ విద్యార్థులు ఎస్వి డిగ్రీ కళాశాల 20092012 బ్యాచ్ కి సంబంధించిన పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా మేమున్నాము అంటూ 35,500 నగదు 50 కేజీల బియ్యం ఇంటికి వెళ్లి సహాయం చేయడం జరిగింది. మా ఫ్రెండ్ రాజేష్ కు ఇలా ఆరోగ్య పరిస్థితి ఉన్నందున మాకు ఎంతో బాధాకరంగా ఉందని పూర్వ విద్యార్థులు వారి బాధను చెప్పుకొచ్చారు.

## ఘనంగా కొండా సుష్మిత పటేల్ జన్మదిన సంబరాలు

### పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు






**వరంగల్, మహా :** తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ మురళీధర్ రావు రాజకీయ వారసురాలు కొండా సుష్మిత పటేల్ (చిట్టక్క) జన్మదిన సంబరాలు వరంగల్ తూర్పు నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సికెఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొండా యువసేన ప్రెసిడెంట్ కొండా వీరాభిమాని బత్తుల వినోద్, ఇనుగల బాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

**పోచమ్మ మైదాన్ జంక్షన్ లో**

కొండా సుస్మిత పటేల్ జన్మదినం సందర్భంగా వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. మొదటగా ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి గోపాల్ నవీన్ రాజ్ భారీ కేక్ కట్ చేసి, మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. జంక్షన్లో అన్నదానం నిర్వహించి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సీకేఎం ప్రసూతి హాస్పిటల్ లో జంబో కూలర్లు ఆసుపత్రికి బహుకరించి గర్భిణీ మహిళలకు, ప్రసవం అయిన మహిళలకు వివిధ రకాల పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ సీనియర్ నేత మీసాల ప్రకాష్, 28 డివిజన్ అధ్యక్షుడు కురిమిళ్ళ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కొండా సుస్మితా పటేల్ జన్మదిన వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, భారీ కేక్ ను కట్ చేసి స్థానిక ప్రజలకు మిఠాయిలతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కత్తిరిశాల వేణుమాధవ్, కోడం శివకృష్ణ, సిలివేరు శ్రీనివాస్, జన్ను అనిల్, సయ్యద్ వసీం, తోట వేణు, మబ్బు ప్రవీణ్ కుమార్, దాసరి రాజేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను సందర్శించిన డిఎంహెచ్వో



**వరంగల్, మహా :** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు వర్ధన్నపేట 1 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను సందర్శించి వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి తెలుపుతూ, ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని అంతే కాకుండా సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని సూచించారు. ముఖ్యంగా గడువు దాటి పోయిన మందులు ఏమైనా ఉంటే వెంటనే వాటిని డిస్పో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ మౌనిక, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, స్వర్ణకుమారి ఆరోగ్య పర్య వేక్షకురాలు, మంజుల ఆరోగ్య కార్యకర్తలు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ మహా :** ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ క్రింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31 తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరకాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆడిగి తెలుసుకొగా అధికారులు బాగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. నర్సంపేట మునిసిపల్ పరిధిలో 5732 మంది దరకాస్తూ చేసుకోగా 2271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా, 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందజేయడం జరిగిందని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంధ్య, టి పి ఓ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



**చింతలపాలెం, మహా :** చింతలపాలెం గ్రామంలో ఈ వేసవి కాలంలో ఎస్సీ కాలనీ వాసులు మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉండి తాగునీరుకి ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని కాలని వాసుల ద్వారా తెలుకున్న నందిరెడ్డి ఇంద్రారెడ్డి ఎస్సీ కాలనీ వాసులకు భరోసా ఇచ్చి వెంటనే బోరు బండిని పిలిపించి తన వంతు సహాయంగా బోరు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోర్తల సీతారెడ్డి. ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కార్యదర్శి. చింతిర్యాల రవి బాలచందర్. చింతిరాల సురేందర్. రవి. యేసు. పిచ్చయ్య. సిపిఎం పార్టీ నాయకులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## పట్టణంలో నీటి ఎద్దడి

### కలెక్టర్ ను కలిసి విన్నవించిన మాజీ కౌన్సిలర్లు



**ఆదిలాబాద్, మహా :** వేసవి ప్రారంభమైన నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటిపోయి ఆదిలాబాద్ పట్టణంలో నీటి ఎద్దడి ప్రారంభమైంది. లాండసాంగ్వి వాగులోని రెండు ఊటబావుల్లో నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోవడంతో దానిపై ఆధారపడ్డ మున్సిపాల్టీలోని పలు కాలనీలకు నీటి సరఫరాలో కొంత అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా తిర్పెల్లి, మహాలక్ష్మీవాడ, కోలిపుర, బ్రాహ్మణవాడ, చించర్వాడ, ఖిల్లా, తాటిగూడ, కుమార్‌పేట్, ఖానాపూర్, అంబేడ్కర్ నగర్, బొక్కల్ గూడ, శాంతినగర్, రవీంద్రనగర్ తదితర కాలనీల్లో ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాల్సి వస్తోంది. లాండసాంగ్వి వాగులో రెండు మోటార్లలో ఒకే మోటారు వినియోగిస్తున్నా నీటి లభ్యత లేకపోవడం సమస్యగా మారింది.ఒకవేళ పూర్తిగా ఎండిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 6 ట్యాంకర్లు ఉండగా మరో 3 ట్యాంకర్లు అద్దెకు తీసుకొని సమస్యాత్మక కాలనీలకు నీటిని అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భూగర్భజలాలు అధికంగా ఉన్న చోట తొమ్మిది నుంచి పదివరకు కొత్త బోర్లు వేయాలని ఆలోచిస్తున్నారు. వాటి ద్వారా లోకల్ ట్యాంకర్లలో నింపి సరఫరా చేయాలని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా నీటి ఎద్దడి నివారణకుగాను రూ.1.28 కోట్లు అవసరమని ప్రణాళిక తయారు చేసి ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు నివేదిక సైతం అందజేశారు. ఆ పనుల అమలుపై కసరత్తు కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను ఛాంబర్‌లో కలిసి సమస్యను విన్నవించారు. తక్షణమే నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. పట్టణంలో గత 30 సంవత్సరాల నుండి ఎప్పుడూ లేని విధంగా నీటి ఎద్దడి కొనసాగుతోందన్నారు. మరో రెండునెలల్లో అతి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. లాండసాంగ్వి వద్ద రెండు చెక్ డ్యామ్‌లు, మావల వద్ద మట్టి పూడికతీత చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మరో 10 వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో ఉన్న ప్రతి వాటర్ ట్యాంకు వద్ద పెద్ద బోర్లు వేసి వాటి నీటిని ట్యాంకులోకి ఎక్కించాలని, నీటి సమస్యను తీర్చాలని అన్నారు. నిర్మల్ నుండి వచ్చే మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు.

## 33వ డివిజన్ లో మహిళలకు చీరలు పంపిణీ

### కొండా వీరాభిమాని కోడం శివకృష్ణ



**వరంగల్, మహా :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 33వ డివిజన్ లో కొండా సుస్మిత పటేల్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి నగరం లోని పేద ప్రజలకు అన్నదానం బిర్యానీ ప్యాకెట్లు అందజేయడం జరిగింది. అనంతరం డివిజన్లోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సుధాకర్, డివిజన్ అధ్యక్షులు కత్తెరశాల శ్రీధర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుక్కు కానున్న సీసీఐ ఆశలు

- పునరుద్ధరణపై నీలినీడలు
- తుక్కుకింద అమ్మేందుకు ప్రయత్నాలు
- తెరిపించాలని ఉద్యమిస్తున్న సాధన కమిటీ

**ఆదిలాబాద్, మహా :** సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలంటూ పట్టణంలో ఒకవైపు సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతుంటే మరోవైపు ఫ్యాక్టరీ సామగ్రిని తుక్కుకింద అమ్మేందుకు కార్యాచరణ సాగుతోంది. 2022 లోనే యాజమాన్యం టెండర్లు ఆహ్వానించగా... అప్పట్లో ఆందోళనలు జరగడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజాగా మరోసారి తుక్కుకింద అమ్మాలని నిర్ణయించడంతో సాధన కమిటీ ఉద్యమబాట పట్టింది. సీసీఐ పునరుద్ధరణపై ఎన్నికల సమయంలో బీజేపీ లీడర్లు హామీలు ఇస్తున్నారే తప్పా ఆచరణలో పెట్టడంలేదని, ఫ్యాక్టరీ పునరుద్ధరణలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు వైఫల్యం చెందారంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి పెంచి సీసీఐ పునరుద్ధరణ కోసం తమ వాణిని వినిపించాలంటున్నారు. లేదంటే భవిష్యత్తులో బీజేపీకి.. గడ్డు పరిస్థితులు ఎదురవడం ఖాయమంటూ హితవు పలుకుతున్నారు.

**అన్నీ ఉన్నా..**

అప్పట్లో 1500 మందికి ప్రత్యక్షంగా..మరో 4 వేల మందికి పరో అప్పట్లో 1500 మందికి ప్రత్యక్షంగా.. మరో 4 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేంద్రం తాజా నిర్ణయంతో సీసీఐ కథ ఇక ముగిసినట్లేనని స్పష్టమవుతోంది. ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైన అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిచడంపై ఈ ప్రాంతవాసుల నుంచి విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. సిమెంట్ ఉత్పత్తికి ప్రధాన వనరైన సున్నపురా యి నిల్వలు మరో 30 ఏళ్లకు సరిపడా ఉండగా ఎందుకు స్పందించడంలేదంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అలాగే 750 ఎకరాల సొంత భూమితోపాటు మరో రెండు వేల ఎకరాల మేర లీజు భూములున్నాయని, 120 ఎకరాల్లో పరిశ్రమ విస్తరించి ఉందని చెబుతున్నారు. ఉద్యోగుల భవన సముదాయం సైతం అందుబాటులో ఉందని, ఉత్తర, దక్షిణ భారతానికి సిమెంట్ రవాణా చేసేందుకు అనుకూలంగా రైలు, రోడ్డు మార్గాలు ఉన్నాయంటున్నారు. ఇలా అన్ని వనరులు అందుబాటులో ఉన్న ఫ్యాక్టరీని పునరుద్ధరించడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ కార్మిక సంఘాలు నిలదీస్తున్నాయి. రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల సమయం లో ఇదే హామీతో ఓట్లను దండుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ బీజేపీ నుంచే గెలవడంతో పరిశ్రమ పునరుద్ధరణపై కార్మికవర్గంలో ఆశలు చిగురించాయి. అయితే కేంద్రం ఆ దిశగా ఎలాంటి చొరవ చూపడంలేదు. ఏళ్లుగా ఫ్యాక్టరీ మూతపడి ఉండడం, నిర్వహణ లేకపోవడంతో యంత్రాలన్నీ తుప్పుపట్టాయి. నివాస భవన సముదాయాలు సైతం శిథిలావస్థకు చేరాయి. లారీలు, టిప్పర్లు వంటి వాహనాలు పనికి రాకుండా పోయాయి. ఈ క్రమంలో 71 యంత్రాలు, ఇతర భవనాల సామగ్రిని అమ్మేందు కోసం రూ.43.30 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఇందులో పాల్గొనే కాంట్రాక్టర్లు రూ.1.92 కోట్లను ఈఎండీగా చెల్లించాలంటూ.. నిర్ణయించారు.





## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

స్వల్ప లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 757.55 పాయింట్లు లేదా 0.97 శాతం నష్టంతో 77,259.64 వద్ద, నిఫ్టీ 204.10 పాయింట్లు లేదా 0.86 శాతం నష్టంతో 23,464.55 వద్ద నిలిచాయి.టూరిజం ఫైనాన్స్ కార్ప్ ఆఫ్ ఇండియా, కాప్రి గ్లోబల్ క్యాపిటల్, జెనస్ పేపర్ & బోర్డ్, పిల్ ఇటాలికా లైఫ్‌స్టైల్, SMS లైఫ్ సైన్సెస్ ఇండియా వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో ఉన్నాయి. NDL వెంచర్స్, సలాసర్ టెక్నో ఇంజనీరింగ్, BLB షేర్, లోటస్ ఐ కేర్ హాస్పిటల్ వంటి కంపెనీలు నష్టాలను చవి చూశాయి. మార్కెట్ గురించి సాక్షి వెబ్ సైట్లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు.

## జీఎమ్ఎస్ గోల్డ్ స్కీమ్ నిలిపేసిన ప్రభుత్వం




బంగారం ధరలు రోజు రోజుకు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా బుధవారం నుంచి 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్'ను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే.. బ్యాంకులు తమ స్వల్పకాలిక గోల్డ్ డిపాజిట్ పథకాలను (13 సంవత్సరాలు) కొనసాగించవచ్చని ఒక ప్రకటనలో వెల్లడించింది. పసిడి దిగుమతులపై దేశం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి మాత్రమే కాకుండా.. గృహాలు, సంస్థలు తమ బంగారాన్ని ఉత్పాదక ప్రయోజనాల కోసం ఉపయోగించుకునేలా ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని 2015 సెప్టెంబర్ 15న ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి నవంబర్ 2024 వరకు 31,164 కేజీల బంగారాన్ని సమీకరించారు. నిజానికి గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ అనేది మూడు విధాలుగా ఉంటుంది. అవి షార్ట్ టర్మ్ బ్యాంక్ డిపాజిట్ (13 సంవత్సరాలు), మిడ్ టర్మ్ గవర్నమెంట్ డిపాజిట్ (57 సంవత్సరాలు), లాంగ్ టర్మ్ గవర్నమెంట్ డిపాజిట్ (1215 సంవత్సరాలు). బంగారం ధరలు పెరుగుతున్న తరుణంలో.. ప్రభుత్వం తన మిడ్ టర్మ్, లాంగ్ టర్మ్ డిపాజిట్లను నిలిపివేయాలని నిర్ధారించింది. షార్ట్ టర్మ్ డిపాజిట్ల విషయాన్ని నిర్వహించడం లేదా నిర్వహించకపోవడం అనేది పూర్తిగా బ్యాంకులే నిర్ణయించుకునేలా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

## రోల్స్ రాయిస్.. 2,500 మందికి లేఆఫ్స్



ప్రముఖ బ్రిటిష్ లగ్జరీ కారు, ఏరో ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్ రాయిస్ గడిచిన ఏడాది కాలంలో 2,500 మందికి లేఆఫ్స్ ప్రకటించింది. వీరిలో ఎక్కువ మంది మేనేజర్ స్థాయి ఉద్యోగులేనని ఫార్చ్యూన్ రిపోర్ట్ తెలిపింది. కంపెనీ సీఈఓగా టుఫాన్ ఎర్గిన్‌బిలిక్ బాధ్యతలు చేపట్టిన సంవత్సరం కాలంలో విభిన్న పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో భాగంగా కొందరు ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించడంతోపాటు సంస్థ షేరు ధర 500 శాతం ఎగబాకి రికార్డు నెలకొల్పింది. రోల్స్ రాయిస్ సీఈఓగా టుఫాన్ ఎర్గిన్‌బిలిక్ 2023 చివర్లో బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో నిర్దిష్ట గడువులోపు కంపెనీ ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని నిర్ణయించున్నారు. సంస్థ రెవెన్యూ పెంచడంలో భాగంగా 2,500 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించారు. దాంతోపాటు కొన్ని విధానపరమైన నిర్ణయాలతో సంస్థ ఆదాయాన్ని ముందుగా నిర్ణయించుకున్న గడువులోపే మార్కెట్ విలువకు 70 బిలియన్ డాలర్లకు పైగా జోడించారు. ఇది పెట్టుబడిదారులను ఆకర్షించి స్టాక్ ధర ఏకంగా ఏడాదిలో 500 శాతం ఎగబాకేలా చేసింది.

## శామ్‌సంగ్ ఇండియాపై రూ.5,149 కోట్ల జరిమానా




దిగుమతి సంబంధిత పన్ను ఎగవేతపై భారత ప్రభుత్వం పన్నులు, జరిమానాల రూపంలో శామ్‌సంగ్‌కు 601 మిలియన్ డాలర్ల(రూ.5,149 కోట్లు) డిమాంట్ నోటీసులు జారీ చేసింది. కొన్నేళ్లుగా కీలక టెలికాం పరికరాలను తప్పుగా వర్గీకరిస్తూ ఈ కంపెనీ ఉద్దేశపూర్వకంగా భారీ సుంకాలను తప్పించుకుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 0182021 మధ్య కాలంలో 4జీ మొబైల్ టవర్లలో ఉపయోగించే కీలక భాగాలైన 'రిమోట్ రేడియో హెడ్స్' (ఆర్‌ఆర్‌హెచ్)లను శామ్‌సంగ్ దిగుమతి చేసుకోవడంపై ఈ వివాదం కేంద్రీకృతమైంది. భారత్‌లో 10% నుంచి 20% దిగుమతి సుంకాలు చెల్లించకుండా ఉండటానికి కంపెనీ ఈ వస్తువులను తప్పుగా వర్గీకరించింది. ఫలితంగా దక్షిణ కొరియా, వియత్నాం నుంచి 784 మిలియన్ డాలర్ల(సుమారు రూ.6,717 కోట్లు) విలువైన దిగుమతులపై ఎటువంటి సుంకాలు చెల్లించలేదని భారత కస్టమ్స్ అధికారులు ఆరోపిస్తున్నారు. 2021లో జరిగిన దర్యాప్తులో ముంబయి, గురుగ్రామ్‌లోని శామ్‌సంగ్ కార్యాలయాల్లో ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు సోదాలు నిర్వహించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఆ తర్వాత ఈ విడిభాగాలను భారత మొబైల్ నెట్‌వర్క్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో సంస్థకు విక్రయించారు .ఈ దిగుమతులపై సుంకాలు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా తప్పుడు పత్రాలను సమర్పించడం ద్వారా భారతీయ చట్టాలను కంపెనీ ఉల్లంఘించినట్లు కస్టమ్స్ కమిషనర్ సోనాల్ బజాజ్ తెలిపారు. సంస్థ లాభాలను పెంచడానికి శామ్‌సంగ్ అన్ని వ్యాపార నైతికత, పరిశ్రమ పద్ధతులను ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌హెచ్ ట్రాన్సీవర్ కేటగిరీలో ఉందని ప్రభుత్వం పేర్కొంది. అది దిగుమతి సుంకాలకు లోబడి ఉందని తెలిపింది. అయితే కంపెనీ మాత్రం దాన్ని వ్యతిరేకించింది. ఆర్‌ఆర్‌హెచ్ ట్రాన్సీవర్‌గా పనిచేయదని, అందువల్ల టారిఫ్ మినహాయింపులకు అర్హత లభిస్తుందని కంపెనీ వాదిస్తోంది.

### యాక్టివా, షైన్ 125 సహా హోండా బైక్స్‌పై
## ఈ నెలాఖరు వరకే డిస్కౌంట్ ఆఫర్స్



హోండా తన ద్విచక్ర వాహనాలపై అనేక ప్రయోజనాలను ప్రకటించింది. రూ.5,100 ఇన్ స్టంట్ క్యాష్ బ్యాక్, రూ.2,000 విలువైన ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తోంది. ఇది కాకుండా, ప్రతీ కొనుగోలుపై ఒక ప్రత్యేక బహుమతి కూడా ఉంది. షైన్ 100, షైన్ 125, యాక్టివా, యాక్టివా 125 మోడళ్లకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఆఫర్ల గురించి మరింత సమాచారం పొందడానికి మీ సమీప హోండా డీలర్ షిప్ లను సంప్రదించాలని మేము సూచిస్తున్నాము. ఎందుకంటే వారు మరిన్ని వివరాలను అందించగలుగుతారు. ఈ ఆఫర్లు మార్చికి మాత్రమే వర్తిస్తాయని గమనించాలి.


### యూజర్లకు షాక్ ఇవ్వబోతున్న టెలికాం కంపెనీలు
## త్వరలోనే పెరగనున్న రీచార్జ్ ధరలు..!




మొబైల్ రీచార్జ్ ధరలు ప్రియం కానున్నాయి. భవిష్యత్‌లో కంపెనీలు టారిఫ్ ధరలు వరుసగా పెంచనున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకునేందుకు కంపెనీలు ధరలను సవరించనున్నాయి. కంపెనీలు ఇప్పటికే 2019 డిసెంబర్, 2021 నవంబర్‌తో పాటు పాటు 2024 జులైలో మూడుసార్లు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. టెలికాం కంపెనీలు యావరేట్ రెవెన్యూ పర్ యూజర్ ను పెంచాలని యోచిస్తున్నాయి. ధరల పెరుగుదల చాలా మంది యూజర్లపై భారం పడనున్నది. అధిక చార్జీల కారణంగా కంపెనీలకు ఆదాయం మరింత సమకూరనున్నది. మొబైల్ రీచార్జ్ ధరలు ప్రియం కానున్నాయి. భవిష్యత్‌లో కంపెనీలు టారిఫ్ ధరలు వరుసగా పెంచనున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకునేందుకు కంపెనీలు ధరలను సవరించనున్నాయి. కంపెనీలు ఇప్పటికే 2019 డిసెంబర్, 2021 నవంబర్‌తో పాటు పాటు 2024 జులైలో మూడుసార్లు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. టెలికాం కంపెనీలు యావరేట్ రెవెన్యూ పర్ యూజర్ ను పెంచాలని యోచిస్తున్నాయి. ధరల పెరుగుదల చాలా మంది యూజర్లపై భారం పడనున్నది. అధిక చార్జీల కారణంగా కంపెనీలకు ఆదాయం మరింత సమకూరనున్నది. ప్రస్తుతం 2జీ సేవలకు స్వస్తి చెప్పి యూజర్లు 4జీ వైపు మళ్లుతున్నారు. పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల సంఖ్య సైతం పెరుగుతూ వస్తున్నది. దాంతో డేటా వినియోగం పెరుగుతోంది. వినియోగదారులు అధిక ధరల డేటా ప్లాన్స్‌ని ఎంచుకుంటున్నారు. ఇక ఇంటర్నేషనల్ రోమింగ్, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ వంటి సేవలు సైతం గణనీయంగా పెరిగాయి. భారతదేశం శాటిలైట్ కమ్యూనికేషన్ రంగం విస్తరిస్తోంది. టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ స్కీమ్, టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ 2023 వంటి ప్రభుత్వ చొరవ మద్దతుగా నిలుస్తున్నాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




### అందాల కశ్మీర్‌లో తెరచుకున్న తులిప్ గార్డెన్
## కనువిందు చేస్తున్న రంగురంగుల పూలు



జమ్ముకశ్మీర్ లో రంగురంగుల విరులు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. అక్కడ ఆసియాలోనే అతి పెద్దదైన ఇందిరా గాంధీ తులిప్ గార్డెన్‌లో విరబూసిన తులిప్ పూలు పర్యాటకుల మనసు దోచేస్తున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీనగర్ లోని తులిప్ గార్డెన్ ను పుష్పవర్ధన విభాగం అధికారులు తెరిచారు. ఏటా పుష్పాలు వికసించే సీజన్‌లో పర్యాటకుల సందర్శనార్థం ఈ గార్డెన్‌ను తెరుస్తుంటారు. తులిప్ పూలతోపాటు చాలా రకాల ఇతర పుష్పాలు కూడా తులిప్ గార్డెన్‌కు వచ్చే పర్యాటకులను ఆకర్షిస్తాయి. శ్రీనగర్‌లోని తులిప్‌తోట.. ఆసియాలోనే అతి పెద్దది. ప్రకృతి అందాలకు కేరాఫ్‌గా ఉంటుంది ఈ తులిప్ తోట. ఈ భూలోక స్వర్గాన్ని చూసేందుకు ఏటా లక్షల మంది పర్యాటకులు శ్రీనగర్‌కు క్యూ కడుతుంటారు. ఈ సీజన్‌లో అక్కడ పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. దేశ, విదేశాల నుంచి భారీగా తరలివస్తుంటారు. ఈసారి కూడా తులిప్ పూలు బాగా వికసించాయి. ఈ ఏడాది 17 లక్షల పువ్వులు పర్యాటకులను కనువిందు చేయనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చాలా నగరాల్లో తులిప్ పూల గార్డెన్‌లు ఉన్నాయి. అయితే శ్రీనగర్‌లోని తులిప్ గార్డెన్ మాత్రం ఆసియా ఖండంలోనే అతిపెద్దది. ఈ గార్డెన్ విస్తీర్ణం ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 30 హెక్టార్‌లు ఉంది. ప్రతి ఏటా వసంత రుతువులో పుష్పాలు వికసిస్తుంటే ఈ గార్డెన్‌ను తెరుస్తారు. అదేవిధంగా ప్రతి ఏడాది తులిప్ ఫెస్టివల్ పేరుతో ఉత్సవాలను కూడా నిర్వహిస్తారు.

### మరో సౌరభ్ కథ! పెళ్లైన 15రోజుల లోపే
## భర్తను చంపించిన భార్య - లవర్ కోసం



యూపీలో సౌరభ్ రాజ్‌పుట్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొన్ని రోజులకే, అదే తరహాలో, అదే రాష్ట్రంలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది! ఓ మహిళ, ప్రియుడితో కలిసి తన భర్తను చంపేందుకు ప్లాన్ చేసింది. చివరికి, కాంట్రాక్ట్ కిల్లర్ చేత భర్తను హత్య చేయించింది. పెళ్లైన 15 రోజులలోపే ఇదంతా జరగడం గమనార్హం.

**అసలేం జరిగింది..**

యూపీ ఔరాయాలో జరిగింది ఈ ఘటన. 25ఏళ్ల దిలీప్ యాదవ్‌కి ఇటీవలే వివాహం జరిగింది. అతని భార్య పేరు ప్రగతి యాదవ్. ఆమె వయస్సు 22ఏళ్లు. కాగా ప్రగతి యాదవ్‌కి పెళ్లికి ముందే ఒక లవర్ ఉన్నాడు. అతని పేరు అనురాగ్ అలియాస్ మనోజ్. లవర్ కోసం భర్తను చంపాలని ప్రగతి భావించింది. ఇద్దరు కలిసి ఒక ప్లాన్ వేశారు. ఇందులో భాగంగానే దిలీప్‌ని చంపాలని రామ్‌జీ చౌదరీ అనే కాంట్రాక్ట్ కిల్లర్‌కి రూ. 2లక్షలు ఇచ్చారు. మార్చ్ 19న దిలీప్ పై రామ్‌జీ చౌదరీ దాడి చేశాడు. పొలాల్లో ఒక వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడన్న వార్తతో పోలీసులు ఘటనాస్థలానికి పరుగులు తీశారు. అతడిని బిధూనాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి తరలించారు. బాధితుడిని ఔరాయా వాసిగా గుర్తించిన పోలీసులు, వెంటనే అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా ఆరోగ్యం క్షీణించడంతో దిలీప్‌ని అదే రోజు సఫై ఆసుపత్రికి అక్కడి నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని మరో హాస్పిటల్‌కి షిఫ్ట్ చేశారు. ఆ తర్వాత అతడిని ఆగ్రాలో మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. చివరికి మార్చ్ 20న ఔరాయాలోని మరో ఆసుపత్రిలో చేర్పించారు కుటుంబసభ్యులు.

**చికిత్స పొందుతూ దిలీప్ మార్చ్ 21 రాత్రి ప్రాణాలు వదిలాడు.**


ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు దిలీప్‌ని ఎవరు చంపారు? పాత కక్షలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా దిలీప్ భార్యపై అనుమానాలు మొదలయ్యాయి. సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించగా.. ప్రగతి యాదవ్, అనురాగ్, రామ్‌జీలు ముగ్గురూ దొరికిపోయారు. ఆ ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదంతా దిలీప్ ప్రగతిల పెళ్లైన 15రోజుల్లో జరిగిపోవడం గమనార్హం! ఈ వార్త స్థానికంగా కలకలం రేపింది. నిందితులను కఠినంగా శిక్షించాలని దిలీప్ కుటుంబసభ్యులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### సభ నడిపే పద్ధతి ఇది కాదు
## స్పీకర్ ఓం బిర్లాపై రాహుల్‌గాంధీ కామెంట్స్



లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పీకర్ ఓం బిర్లా తీరుపై మండిపడ్డారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని, ఇది అప్రజాస్వామికమని వ్యాఖ్యానించారు. సభలో ఏం జరుగుతుంతో తనకు అర్థం కావడంలేదని, ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఆరోపించారు. బుధవారం సరైన కారణం లేకుండా స్పీకర్ సభను వాయిదా వేశారని విమర్శించారు. తాను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడ్డా స్పీకర్ మాట్లాడనివ్వడం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కనీసం మాట్లాడనివ్వకపోతే తమ వాయిస్‌ను ఎలా వినిపించాలని ఆయన ప్రశ్నించారు. తనను ఒక్క ముక్క కూడా మాట్లాడనివ్వలేదని ఆరోపించారు. గడిచిన ఏడు ఎనిమిది రోజులుగా స్పీకర్ తన విషయంలో ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇది ప్రభుత్వ కొత్త వ్యూహమని, సభలో ప్రతిపక్షాలకు చోటులేదని విమర్శించారు. ఇటీవల లోక్‌సభలో ప్రధాని మోదీ కుంభమేళాపై ప్రసంగం చేసినప్పుడు కూడా తాను మాట్లాడేందుకు ప్రయత్నించానని, అప్పుడు కూడా స్పీకర్ తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. స్పీకర్ ఉద్దేశం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రూల్ 349కు అనుగుణంగా నడుచుకుంటారని భావిస్తున్నామంటూ స్పీకర్ సభను వాయిదా వేయడాన్ని రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. రూల్ 349కు విరుద్ధంగా తాను ఏం చేశానని ప్రశ్నించారు. ప్రధాని మోదీ కుంభమేళాపై ప్రసంగిస్తుండగా తొక్కిసలాటలో మరణించిన వారి గురించి ప్రస్తావించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారని, కానీ ప్రధాని తొక్కిసలాట మృతులకు కనీసం సంతాపం కూడా తెలియజేయలేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. పైగా స్పీకర్ రూల్ 372ని విధించారని, ఈ రూల్ ప్రకారం ప్రధానిగానీ, మంత్రిగానీ మాట్లాడుతున్నప్పుడు ఇతర సభ్యులు ఎలాంటి ప్రశ్నలు వేయకూడదని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఉంటుందని, కానీ వీళ్లు మాత్రం తనను మాట్లాడనివ్వడంలేదని ఆరోపించారు.

### తోటి విద్యార్థులతో చెంపపై కొట్టించిన టీచర్
## కేసు నమోదు



తప్పుడు సమాధానాలు చెప్పిన విద్యార్థుల చెంపపై మరో విద్యార్థితో టీచర్ కొట్టించింది. సరిగా కొట్టనందుకు ఆ స్టూడెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థిని ఫిర్యాదుతో లేడీ టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 24న ప్రభుత్వ బాలికల స్కూల్‌కు చెందిన ఒక ఉపాధ్యాయురాలు సంస్కృత పదాలకు అర్థాలను విద్యార్థులను అడిగింది. క్లాస్ లీడర్ అయిన విద్యార్థిని సరిగా సమాధానాలు చెప్పింది. అయితే క్లాస్‌లోని సుమారు 12 మంది స్టూడెంట్స్ సరిగా సమాధానాలు చెప్పలేదు. దీంతో ఆ విద్యార్థుల చెంపపై కొట్టమని క్లాస్ లీడర్ అయిన విద్యార్థినిని ఆ టీచర్ ఆదేశించింది. కాగా, ఉపాధ్యాయురాలి ఆదేశాలను ఆ విద్యార్థిని పాటించింది. సరిగా సమాధానం చెప్పని స్టూడెంట్స్ చెంపలపై మెల్లగా కొట్టింది. దీంతో ఆ స్టూడెంట్ పట్ల టీచర్ మండిపడింది. బాలికలను గట్టిగా కొట్టాలని గట్టిగా అరిచింది. 'నువ్వు క్లాస్ మానిటర్. చెంపపై ఎలా కొట్టాలో కూడా నీకు తెలియదు' అని తిట్టింది. మరోవైపు క్లాస్ మానిటర్ అయిన ఆ విద్యార్థిని ఈ సంఘటనపై కలత చెందింది. దీంతో తన తల్లిదండ్రుల సహాయంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉపాధ్యాయురాలి ప్రవర్తన తనను భయానికి గురి చేసినట్లు ఆరోపించింది. 'నా గురించి నీ తల్లిదండ్రులకు ఏమైనా చెప్పుకో. ఎవరూ నన్నేమీ చేయలేరు' అని గతంలో కూడా పలుసార్లు హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో పిల్లల సంరక్షణ చట్టం, పిల్లల పట్ల క్రూరత్వం సెక్షన్ల కింద ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

### ఇండియాలో టాప్ ఐటీ కంపెనీల్లో పని చేస్తే
## యూఎస్‌లో నో జాబ్?

ఓ రిక్రూటర్ తనకు అనుకోకుండా 'సీక్రెట్ ఇంటర్నల్ సెలక్షన్ గైడ్‌లైన్స్'ని షేర్ చేసినట్టు రెడ్డిట్ యూజర్ చెప్పుకొచ్చాడు. ఒక వ్యక్తిని ఉద్యోగానికి ఎంపిక చేసే సమయంలో ఏ విషయాలను పరిశీలించాలి? అన్న వివరాలను అందులో ఉన్నాయని అతను వెల్లడించాడు. గైడ్‌లైన్స్ ప్రకారం.. టాప్ యూనివర్సిటీల్లో కంప్యూటర్ సైన్స్ చదివిన వారికి ప్రాధాన్యత లభిస్తుంది. అదే సమయంలో పలు కంపెనీల్లో పనిచేసిన వారిని ఉద్యోగంలో తీసుకోకుడదు. "ఎంఐటీ, స్టాన్‌ఫర్డ్, యూసీ బెర్క్‌లే, యూఐయూసీ, యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూ, కాల్‌టెక్ వంటి వర్సిటీల్లో సీఎస్‌లో బ్యాచిలర్ లేదా మాస్టర్స్ చేసిన వారికి ఉద్యోగం ఇవ్వాలి. ఇతర స్కూల్స్‌లో 4.0 కన్నా ఎక్కువ జీపీఏతో పాస్ అయిన వారికి మినహాయింపు లభించవచ్చు. 410ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పీరియెన్స్, జావాస్క్రిప్ట్, ఏఐ/ఎల్ఎల్ఎంలో అనుభవం ఉండాలి," అని ఆ రిక్రూటర్ గైడ్‌లైన్స్‌లో ఉంది.

## హెచ్1బీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగింపు- మరి నెక్స్ట్ ఏంటి?




2026 ఆర్థిక సంవత్సరానికి (ఎఫ్‌వై 2026) ఇనీషియల్ హెచ్ 1 బీ వీసా రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2025 మార్చ్ 24తో అధికారికంగా ముగిసింది. నెక్స్ట్ ఏంటి? అన్నది ఇప్పుడు హెచ్ 1బీ వీసా కోసం ఎదురుచూస్తున్న చాలా మందికి ఉన్న అతిపెద్ద ప్రశ్న. రిజిస్ట్రేషన్ల సంఖ్య వార్షిక పరిమితిని మించితే, వీసా గ్రహితలను రాండమ్‌గా ఎంపిక చేసేందుకు లాటరీ విధానాన్ని అమలు చేస్తుంది యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) లాటరీ ఫలితాలను సాధారణంగా మార్చ్ చివరిలో లేదా ఏప్రిల్ మొదట్లో ప్రకటిస్తారు. ఎంపికైన వారికి సంబంధించి, ఏప్రిల్ 1, 2025 నుంచి పూర్తి హెచ్ 1బీ పిటిషన్లు ఎంప్లాయర్లు దాఖలు చేయవచ్చు. ఫైలింగ్ వ్యవధి సాధారణంగా సెలక్షన్ నోటిఫికేషన్ తేదీ నుంచి 90రోజులు ఉంటుంది. అంటే ఇది ఏప్రిల్ 1 నుంచి జూన్ 30, 2025 వరకు నడుస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరం కింద ఆమోదం పొందిన దరఖాస్తుదారులకు ఉపాధి 2025 అక్టోబర్ 1 లేదా ఆ తరువాత ప్రారంభమవుతుంది. ఒకవేళ దరఖాస్తుదారుడు ఎంపిక కానట్లయితే, వారి రిజిస్ట్రేషన్ "సబ్మిటెడ్" స్టేటస్‌లో ఉంటుంది. క్యాప్ స్లాట్లు తెరిచి ఉంటే యూఎస్‌సీఐఎస్ అదనపు లాటరీ రౌండ్లను నిర్వహించవచ్చు. కాబట్టి దరఖాస్తుదారులు అప్డేట్స్ కోసం వారి యూఎస్‌సీఐఎస్ ఖాతాలను పర్యవేక్షించాలి. ఈ ఏడాది హెచ్ 1బీ విధానంలో రిజిస్ట్రేషన్ ఫీజులు భారీగా పెరగడం గమనార్హం. 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు, ప్రతి లబ్ధిదారుని ఖర్చు 2050% పెరిగింది. యూఎస్‌సీఐఎస్ ధృవీకరించిన రుసుము అడ్మినిస్ట్రేషన్ ఖర్చులను భరించడానికి, అనవసరంగా రిజిస్ట్రేషన్లు వేసే వారిని కట్ చేయడానికి ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన లబ్ధిదారు కేంద్రీకృత ఎంపిక ప్రక్రియ కూడా ఉంది అయితే ఒకటి కంటే ఎక్కువసార్లు లాటరీ వ్యవస్థలోకి రాకుండా ఇది చూసుకుంటుంది. లాటరీ ఇంటిగ్రిటీని పెంచేందుకు హెచ్ 1బీ లాటరీ ప్రాసెస్‌కు అదనపు ఫ్రాడ్ ప్రివెన్షన్ చర్యలను కూడా జోడించింది.



# సల్మాన్ కొత్త సినిమాకు ఘోరమైన పరిస్థితి!

ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. టీజర్, ట్రైలర్ ని బట్టి సినిమా చూడాలా వద్దా అనేది ప్రేక్షకులు డిసైడ్ చేస్తున్నారు. అక్కడున్నది స్టార్ హీరో అయినా, అనామక హీరో అన్నది పట్టించుకోవట్లేదు. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కొత్త మూవీకి సరిగ్గా ఇలాంటి సమస్యే ఎదురైంది. సల్మాన్ ఖాన్ కి చాన్నాళ్లుగా సరైన హిట్ లేదు. దీంతో తమిళ దర్శకుడు ఏఆర్ మురగదాస్ తో కలిసి సికిందర్ తీశాడు. రష్మిక హీరోయిన్. కొన్నిరోజుల క్రితం టీజర్, ట్రైలర్ రిలీజయ్యాయి. కానీ పాజిటివ్ రెస్పాన్స్ రాలేదు. దక్షిణాది సినిమాల కాపీ అనే కామెంట్స్ వినిపించాయి. ఆ ప్రభావం ఇప్పుడు అడ్వాన్స్ బుకింగ్స్ పై పడింది. సల్మాన్ కొత్త సినిమా ఈద్ (రంజాన్)కి రావడం ఆనవాయితీ. అందుకు తగ్గట్లే ఈ సారి పండగకు సికిందర్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా బుకింగ్స్ ఓపెన్ చేశారు. దాదాపు 24 గంటలు గడిచింది గానీ ఇప్పటివరకు రూ.1.91 కోట్ల మేర మాత్రమే టికెక్స్ బుక్ అయినట్లు తెలుస్తోంది. ఈ ట్రెండ్ ఇలానే ఉంటే మాత్రం రిలీజ్ రోజుకి రూ6-10 కోట్ల మాత్రమే వసూళ్లు రావొచ్చేమో అనిపిస్తోంది. మరి సికిందర్ రిలీజై ఎలాంటి టాక్ తెచ్చుకుంటుందో చూడాలి?



# రష్మిక ఆస్తి ఎన్ని కోట్లు? ఏమేం ఉన్నాయి?

అప్పుడప్పుడు కొందరు సెలబ్రిటీలకు దశ తిరిగేస్తుంటుంది. ప్రస్తుతం అలాంటి ఫేజ్ లో రష్మిక ఉంది. తెలుగు, తమిళ, హిందీ.. ఇలా భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంటోంది. తాజాగా ఈమె ఆస్తుల గురించి ఫోర్బ్స్ నివేదిక బయట పెట్టింది. కర్ణాటకకు చెందిన రష్మిక ప్రస్తుత వయసు 28. కానీ ఆస్తి మాత్రం రూ.66 కోట్ల వరకు సంపాదించిందని ఫోర్బ్స్ చెప్పుకొచ్చింది. ఒక్కో సినిమాకు రూ.48 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకుంటుందని పేర్కొంది. రీసెంట్ గా 'ఛావా'తో సూపర్ సక్సెస్ అందుకుంది. త్వరలో ఈమె ఆస్తి రూ.100 కోట్లకు చేరొచ్చని అంచనా. యానిమల్, పుష్ప 2, ఛావా.. ఇలా వరసగా రూ.500 కోట్ల వసూళ్ల సినిమాలు చేసిన రష్మిక మరోవైపు యాడ్స్ చేస్తూ డబ్బులు సంపాదిస్తోంది. హైదరాబాద్, ముంబై, బెంగళూరు, గోవా, కూర్గ్ లో ఈమెకు సొంత ఫ్లాట్స్ ఉన్నాయి. ఇలా రెండు చేతులా సంపాదిస్తున్న రష్మిక.. అప్పుడప్పుడు వెకేషన్స్ కి వెళ్తుంటుంది. మరోవైపు ఈమె దగ్గర బెంజ్, ఆడీ, రేంజ్ రోవర్ లాంటి ఖరీదైన కార్స్ ఉన్నాయి. ఇలా అన్నింటా రష్మిక తగ్గేదే లే అన్నట్లు దూసుకుపోతోంది.

# శంకర్ వరప్రసాద్‌గా చిరంజీవి

## మెగా అప్‌డేట్ ఇచ్చిన అనిల్ రావిపూడి



అనిల్ రావిపూడి అంటేనే హాస్యానికి, విజయానికి చిరునామా. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మామూలు సక్సెస్ అందుకోలేదు. ఎవరూ ఊహించనంతగా బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టాడు. ఈ సంతోషంలో వచ్చే ఏడాది సంక్రాంతికి వస్తున్నామని మాటిచ్చేశాడు. కాకపోతే ఈసారి వెంకీమామతో కాదు.. చిరంజీవితో! ఇందుకోసం వైజాగ్ వెళ్లి సినిమా కథ సిద్ధం చేసుకున్నాడు.


**కథకు పచ్చజెండా ఊపిన చిరు**

గ్యాంగ్ లీడర్, రౌడీ అల్లుడు, ఘరానా మొగుడు రేంజ్‌లో చిరంజీవిని చూస్తారని అభిమానులకు మాటిచ్చాడు. తాజాగా సోషల్ మీడియాలో ఈ సినిమా అప్‌డేట్ ఇచ్చాడు. 'కథ పూర్తయింది. చిరంజీవిగారికి ఫైనల్ స్క్రిప్ట్ చదివి వినిపించాను. నా కథలోని శంకర్ వరప్రసాద్ పాత్రను పరిచయం చేశాను. ఆయనకు చాలా బాగా నచ్చింది. ఇంకెందుకు లేటు.. త్వరలో ముహూర్తంతో చిరునవ్వుల పండగబొమ్మకు శ్రీకారం చుట్టేద్దాం' అని ఎక్స్(ట్విటర్)లో ట్వీట్ చేశాడు.

**చిరంజీవి ఒరిజినల్ పేరుతో..**

షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఈ సినిమా నిర్మితం కానుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించనున్నాడు. ఇది చూసిన అభిమానులు ఉగాదికి ముందు ఎంత మంచి శుభవార్త చెప్పారు.. ఇంకో బ్లాక్‌బస్టర్ తథ్యం అని కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్. ఇందులో శివ అనే పదాన్ని తీసేసి మిగతాది యథాతథంగా వాడేశారు. మెగాస్టార్ అసలు పేరును వాడేస్తున్న అనిల్ రావిపూడి సినిమాలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో తెలియాలంటే వచ్చే సంక్రాంతిదాకా ఆగాల్సిందే!


# క్రీడా వార్తలు SPORTS NEWS



# డికాక్ వన్ మ్యాన్ షో

## రాజస్తాన్‌ను చిత్తు చేసిన కేకేఆర్

ఐపీఎల్ 18వ సీజన్‌ను ఓటమితో ఆరంభించిన కోల్‌కతా నైట్ రైడర్స్ బోణీ కొట్టింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ క్వింటన్ డికాక్(97 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో చెలరేగి జట్టుకు విజయాన్ని అందించాడు. మొదట బంతితో రాజస్థాన్ రాయల్స్‌ను కట్టడి చేసిన కోల్‌కతా ఆపై 152 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. టర్నింగ్ అవుతున్న పిచ్‌పై ఓపెనర్ డికాక్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ(18 నాటౌట్) సహకారంతో జట్టును గెలుపు దిశగా నడిపాడు. జోఫ్రా ఆర్చర్ వేసిన 18వ ఓవర్లో 4, 6, 6 బాదిన డికాక్ కోల్‌కతాకు సూపర్ విక్టరీని కట్టబెట్టాడు. దాంతో, తొలి సీజన్ చాంపియన్ రాజస్థాన్‌కు వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా పంజా విసిరింది. గువాహటిలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కేకేఆర్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఓపెనర్ క్వింటన్ డికాక్(97 నాటౌట్ : 61బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లు) చివరిదాకా నిలబడి జట్టును గెలిపించాడు. స్వల్ప ఛేనదలో ఓపెనర్ మొయిన్ అలీ(5) వెనుదిరిగాక.. కెప్టెన్ అజింక్యా రహానే(18)లు వెనుదిరిగిన తన మార్క్ షాట్లతో చెలరేగాడు డికాక్. ఇంప్యాక్ట్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ(18 నాటౌట్) సాయంతో కోల్‌కతా స్కోర్‌బోర్డును నడిపించాడు. దాంతో, 11 ఓవర్లకు కోల్‌కతా 2 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. స్పిన్నర్లతో ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని తిప్పికొట్టిన ఈ లెఫ్ట్ హ్యాండర్. ఆర్చర్ బౌలింగ్‌లోవరుసగా 4, 6 బాది..మరో సిక్సర్‌తో రాజస్థాన్‌కు రెండో ఓటమి ఖాయం చేశాడు.




### ఆది నుంచి తడబడుతూ

టాస్ ఓడిన రాజస్థాన్ ఇన్నింగ్స్ ఆది నుంచి తడబడుతూ సాగింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(13), సంజూ శాంసన్(29)లు శుభారంభమిచ్చినా స్పిన్నర్ల రాకతో వికెట్ల పతనం మొదలైంది. 3 ఓవర్లకే 28 పరుగులు రాబట్టిన ఈ జోడిని వైభవ్ అరోరా విడదీశాడు. శాంసన్ బౌల్డ్ అయ్యాక వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్ (25) ఉన్నంత సేపు బౌండరీతో విరుచుకపడ్డాడు. అతడికి చెక్ పెట్టేందుకు రహానే తమ అస్త్రం వరుణ్ చక్రవర్తికి బంతి అందించాడు. ఊహించినట్టే పరాగ్ వికెట్ పారేసుకున్నాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్(33) ఒంటరి పోరాటం చేసి జట్టు స్కోర్ 130 దాటించాడు. అతడు ఔటయ్యాక పేసర్ జోఫ్రా ఆర్చర్(16) ధనాధన్ ఆడడంతో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేయగలిగింది.

# అభిమానులకు గుడ్‌న్యూస్..

## భారత్‌కు వచ్చేస్తున్న ఫుట్‌బాల్ మాంత్రికుడు

ఫుట్‌బాల్ లెజెండ్ లియోనల్ మెస్సీ ఆట చూసేందుకు కోట్లాది మంది ఎగబడుతారు. అతడి ఆటోగ్రాఫ్ కోసం పోటీపడుతారు. తన సొగసైన ఆటతో కోట్లాది మందిని అభిమానగణంగా సొంతం చేసుకున్న ఈ స్టార్ ప్లేయర్ మైదానంలోకి దిగాడంటే.. గోల్స్ వర్షం కురవాల్సిందే. మనదేశంలోనూ ఫ్యాన్స్ బోలెడు మంది ఫ్యాన్స్ ఉన్నారు మెస్సీకి. అందుకే అతడు త్వరలోనే భారత్‌కు రాబోతున్నాడు. 'కేరళలోని కొచ్చిలో ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఉంది. అక్టోబర్‌లో జరుగబోయే ఈ మ్యాచ్‌లో ఆడేందుకు ఫుట్‌బాల్ మాంత్రికుడు మెస్సీ మనదేశంలో వాలిపోనున్నాడ'ని కేరళ క్రీడా మంత్రి వీ అబ్దురహీమన్ మంగళవారం వెల్లడించాడు. దాంతో, కేరళవ్యాప్తంగా ఫ్యాన్స్ సంబురాల్లో మునిగితేలుతున్నారు.



**మొదటిసారిగా 2011లో...**

సాకర్ దిగ్గజం మెస్సీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆడేందుకు 2011లో భారతదేశానికి వచ్చాడు. అప్పుడు కోల్‌కతాలో జర వెనిజులాతో జరిగిన పోరులో అర్జెంటీనా 10తో విజయం సాధించింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ దిగ్గజ ఆటగాడు మనదేశంలో ఫుట్‌బాల్ ఆడేందుకు వస్తున్నాడు. అది కూడా తనను అమితంగా ఆరాధించే అభిమానులున్న కేరళలో మెస్సీ ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనున్నాడు. ప్రపంచంలోని మేటి ఫుట్‌బాలర్లలో ఒకడైన మెస్సీ 8సార్లు బాలన్ డి ఓర్ అవార్డు గెలుపొంది. మూడేళ్ల క్రితం అర్జెంటీనాకు వరల్డ్ కప్ అందించి తన కలను సాకారం చేసుకున్నాడు. అయితే.. 2026లో జరుగబోయే ఫిఫా ప్రపంచ కప్‌లో మెస్సీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం మెస్సీ.. ఇంటర్ మియామి క్లబ్ తరపున ఆడుతున్న విషయం తెలిసిందే.

# బీసీసీఐకి షాక్.. ఆదాయంలో భారీ కోత విధించనున్న ఐసీసీ..!

ప్రపంచంలోనే సంపన్నమైన బోర్డు భారత క్రికెట్ నియంత్రణ మండలికి పెద్ద షాక్ తగలనుంది. ఇకపై ప్రతి ఏటా అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి వచ్చే ఆదాయం భారీగా తగ్గిపోనుంది. వరల్డ్ క్రికెట్ సంఘం (డబ్ల్యూసీఏ) ఒత్తిడి మేరకు బీసీసీఐ తాను అందుకుంటున్న సింహ భాగం వాటాను కోల్పోనుంది. ప్రపంచ క్రికెట్లో ఆదాయ పంపిణీలో అసమానతలు ఉన్నాయని, ధనిక బోర్డుకు ఇచ్చే వాటాను తగ్గించుకోవాలని ప్రపంచ క్రికెట్ సంఘం ఈమధ్యే ఐసీసీకి సూచన చేసింది. ఈ క్రమంలోనే బీసీసీఐకి సమర్పిస్తున్న 40 శాతం వాటాను 10 శాతానికి తగ్గించుకోవాలని సూచించింది డబ్ల్యూసీఏ. అయితే.. ఈ విషయమై ఐసీసీ ఛైర్మన్ జై షా, పాలక మండలి ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఐసీసీ తర్వాత ప్రపంచ క్రికెట్‌లో బీసీసీఐ పెద్దన్నలా వ్యవహరిస్తూ వస్తోంది. ఈమధ్యే పాకిస్థాన్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతల గురించి .. బీసీసీఐ వాటా 30 శాతం తగ్గించడం గురించి ప్రపంచ క్రికెట్ సంఘం సూచన చేయడం బీసీసీఐకి తలనొప్పిగా మారనుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com